

యూరియాకు ప్రత్యామ్నాయం
కారాకొల్లు కషాయం

SUNDAY SPECIAL

'యూరియా కోసం రైతుల పడిగాపులు'.., 'యూరియా కొరత'.., 'యూరియా ఇవ్వలేదని నిరసన'.. ఇటీవల మన రాష్ట్రంలో ఎటు చూసినా కనిపించిన దృశ్యాలు ఇవి. వరిలో అధిక దిగుబడి సాధించాలనే కోరిక యూరియా కోసం రైతులు ఎగబడేలా చేస్తోంది. నిజానికి రసాయన ఎరువుల వల్ల భూమి గుల్లవుతోంది. కలుపు పెరిగిపోయి దాన్ని సంహరించడానికి మళ్లీ ప్రమాదకరమైన మందులను చల్లుతున్నారు. అన్నంపెట్టే నేలలో విషం కలిపి పంటలు పండిస్తున్నారు. జబ్బులు ఇబ్బడి ముబ్బడిగా పెరగడానికి ఇటువంటి ఆహారమే కారణమని నిపుణులు ఆందోళన ప్రకటిస్తున్నా వ్యవసాయంలో తీరు మారడం లేదు. సేంద్రియం, ప్రకృతి వ్యవసాయం అని ఎందరు మొత్తుకుంటున్నా అలవాటుపడిన ఎరువులకీ, మందులకే రైతులు మొగ్గు చూపుతున్నారు. ఎరువుల కోసం ఎగబడుతున్నారు. వీటికి ప్రత్యామ్నాయ మందులను కనుగొన్నారు తిరుపతి జిల్లా కారాకొల్లు గ్రామీణ శాస్త్రవేత్తలు. మన చుట్టూ పెరిగేపిచ్చిమొక్కలపై దశాబ్దాలుగా వీరు చేస్తున్న పరిశోధనలు ఫలించాయి. వరికి పోషకాలను అందించే కషాయాన్ని, కలుపును నివారించే మందునూ, వేరుపురుగును అడ్డుకునే ఆకుపసరు మందునూ వీరు తయారు చేశారు. ఆంధ్ర, తెలంగాణ రైతులు వేలాది ఎకరాల్లో ప్రస్తుతం వీటిని వినియోగిస్తున్నారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఈ మందులు రైతులకు వరంగా మారడమే కాదు, మనకు అన్నంపెట్టే నేల ఆరోగ్యాన్ని కాపాడుతాయి.

- 8వ పేజీలో



చిన్నారుల ప్రదర్శనలను ఆసక్తిగా తిలకిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



వేడుకగా బాలోత్సవం

తిరుపతి నగరంలో బాలోత్సవం సందడి మొదలైంది. చిత్రవిచిత్రమైన వేషాల్లో తిరిగే పిల్లలు, వారి వెంట తల్లిదండ్రులు, టీచరు.. బాలల నృత్యాలు, ఉపన్యాసాలు, కథలు చెప్పే పిల్లలు.. గోవిందరాజస్వామి కళాశాల ప్రాంగణం శనివారం ఉదయం నుంచి కళకళలాడింది. కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ప్రారంభించిన నాలుగో బాలోత్సవం వేడుకలు ఆదివారం కూడా జరుగుతాయి. 75 విభాగాల్లో మూడు స్థాయిల్లో జరిగే పోటీలకు దాదాపుగా 10 వేల మంది పిల్లలు హాజరుకానున్నారు.

- తిరుపతి కల్చరల్, ఆంధ్రజ్యోతి














షార్ చరిత్రలో ముందడుగు

- మరో కీలక ఘట్టానికి కౌంట్‌డౌన్ ప్రారంభం
- నింగిలో ప్రయాణానికి ఎల్వీఎం3-ఎం5 సిద్ధం



సీఎంఎస్-03 ఉపగ్రహం

నింగిలోకి ఎగిరేందుకు సిద్ధంగా ఉన్న ఎల్వీఎం3-ఎం5 రాకెట్

సూళ్లూరుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇస్రో మరో చారిత్రక విజయం నమోదుకు సిద్ధమైంది. అత్యంత బరువైన ఉపగ్రహ ప్రయోగానికి షార్ తొలిసారిగా సిద్ధమైంది. ఇందుకు సంబంధించి కౌంట్‌డౌన్ శనివారం సాయంత్రం ప్రారంభమైంది. పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన సీఎంఎస్-03 (జీశాట్-7ఆర్) కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా షార్ నుంచి ఆదివారం సాయంత్రం 5.26 గంటలకు ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. పీఎస్ఎల్వీ రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగిస్తే తాజా రాకెట్‌ను మూడు దశల్లోనే ప్రయోగించనున్నారు. కమ్యూనికేషన్ అవసరాలను తీర్చడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుంది. అంతేకాదు పౌర, వ్యూహాత్మక, నావికా సేవలను అందించనుంది. తాజా ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్ శనివారం సాయంత్రం 5.26 గంటలకు మొదలైంది. 24 గంటల తర్వాత షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి దూసుకెళ్లనుంది. ఇప్పటి వరకు షార్ నుంచి 102 ప్రయోగాలు చేపట్టారు. ఇది 10వ ప్రయోగం.

మూడు దశల్లో ప్రయోగం..

43.5 మీటర్ల ఎత్తు 642 టన్నుల బరువు కలిగిన ఎల్వీఎం3-ఎం5 రాకెట్‌ను మూడు దశల్లో ప్రయోగిస్తారు. మొదటి దశలో స్ట్రాపాన్ బూస్టర్లలో ఉండే 400 టన్నుల ఘన ఇంధన సాయంతో మండించి మొదటి దశ 105 సెకన్లలో పూర్తి చేస్తారు. అక్కడ నుంచి రెండో దశలో 110 టన్నుల ద్రవ ఇంధనాన్ని మండించి 304.70 సెకన్లకు రెండో దశను పూర్తి చేస్తారు. కీలక దశ క్రయోజనిక్ దశను (మూడో) 95.54 సెకన్లకు మూడో దశను పూర్తిచేస్తారు. మూడో దశ అనంతరం రాకెట్ శిఖర భాగాన ఉన్న ఉపగ్రహాన్ని 965.94 సెకన్లకు కక్ష్యలోకి చేరవేస్తుంది.



చెంగాళమ్మ ఆలయంలో పూజకు వెళ్తున్న ఇస్రో నారాయణన్, షార్ డైరెక్టర్ పద్మకుమార్ తదితరులు

ఇస్రో చరిత్రలో ముఖ్యమైన ప్రయోగం

మనదేశ అంతరిక్ష కార్యక్రమం ఎల్వీఎం3-ఎం5 సీఎంఎస్-03 ఉపగ్రహ ప్రయోగంతో ముఖ్యమైన మైలురాయిని చేరుకోనుందని ఇస్రో చైర్మన్ నారాయణన్ అన్నారు. శనివారం ఆయన ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వచ్చే మార్చిలోగా ఏడు ప్రయోగాలు ఉంటాయన్నారు. ఆయనతో పాటు షార్ డైరెక్టర్ పద్మకుమార్, ఎంఎస్ఏ డీడీ గోపికృష్ణ తదితరులు ఉన్నారు.

రేపు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

- మీకోసం కాల్ సెంటర్ 1100ను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను నిర్వహిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మీకోసం కాల్ సెంటర్ 1100 సేవలను ఉపయోగించుకోవాలన్నారు. వినతులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి ఈ నంబర్‌కు కాల్ చేయవచ్చని వివరించారు. అలాగే మీకోసం.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో పంట నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

ఈనెలా కందిపప్పు లేనట్లే!

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు ఈనెలలో కూడా కందిపప్పు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాలోని 5.85 లక్షల తెల్ల రేషన్ కార్డుదారులకు ప్రతినెలా 81,230 టన్నుల బియ్యం, 510 టన్నుల చక్కెర, 420 టన్నుల కందిపప్పు పంపిణీ చేయాల్సి ఉంది. బియ్యం, చక్కెర పంపిణీ చేస్తున్న ప్రభుత్వం కందిపప్పు విషయానికి వచ్చేసరికి మొండిచేయి చూపుతోంది. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు నాణ్యతను బట్టి కిలో రూ.140 నుంచి 160 వరకు పలుకుతోంది. దీంతో కార్డుదారులు రేషన్ షాపుల్లో ఇచ్చే రాయితీ కందిపప్పు కోసం ఎదురు చూస్తున్నారు. తొమ్మిది నెలలుగా ప్రభుత్వం అదిగో ఇదిగో అంటూ కాలం గడుపుతుండటంతో అసంతృప్తికి గురవుతున్నారు. టెండర్ల ప్రక్రియలో జాప్యం జరుగుతోందని అధికారులు అంటున్నారు.

నేడు మాడవీధుల్లోకి ఉగ్రశ్రీనివాసమూర్తి

తిరుమల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): కైశిక ద్వాదశి సందర్భంగా ఉగ్రశ్రీనివాసమూర్తి ఆదివారం ఆలయ మాడవీధుల్లో ఊరేగనున్నారు. ఈ సందర్భంగా సాలకట్ల కైశిక ద్వాదశి ఆస్థానాన్ని టీటీడీ నిర్వహించనుంది. ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి, భూదేవి సమేతంగా ఏడాదిలో ఒక్కసారే ఈ రోజున సూర్యోదయానికి ముందు మాడవీధుల్లో ఊరేగిస్తారు.

పింఛన్ల పంపిణీలో ఫస్ట్ ప్లేస్

- 2,51,100 మందికి రూ.107.76కోట్ల పంపిణీ



ఆర్సీపురం ఎస్టీకాలనీలో పింఛన్ పంపిణీ చేస్తున్న తిరుపతి ఆర్డీవో రామ్మోహన్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో జిల్లాకు మొదటి స్థానం దక్కింది. శనివారం రాత్రి 7.30గంటల వరకు 2,62,556మందికి గాను 2,51,100 మందికి రూ.107.76 పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీడీ ప్రభావతి వెల్లడించారు. జిల్లాలోని 34 మండలాల్లో ఉదయం 7 గంటల నుంచి సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్లు పంపిణీ చేశారు. అక్టోబరు నెలకు సంబంధించి పలు మున్సిపాలిటీలు, మండలాల్లో ఉదయం 10 గంటల తర్వాత పింఛన్లు పంపిణీ చేసిన సచివాలయ ఉద్యోగులకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ఈ నెలలో సకాలంలో పంపిణీ చేశారు.

టీటీడీ ఏవీఎస్వో కళావతి బదిలీ

తిరుమల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): టీటీడీ తిరుపతి విజిలెన్స్ వింగ్ ఏవీఎస్వో కళావతి బదిలీ అయ్యారు. కొన్నేళ్లుగా ఈమె విజిలెన్స్ వింగ్ విభాగంలో ఏవీఎస్వోగా ఉన్నారు. పలు కీలకమైన కేసుల్లో సమర్థవంతంగా విచారణ జరిపి ప్రశంసలు అందుకున్నా విమర్శలు కూడా భారీగా ఎదుర్కొన్నారు. గత ప్రభుత్వం నుంచే ఏవీఎస్వోగా ఉన్న ఆమెను బదిలీ చేసి వైజాగ్ డీజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ పోస్టులో ఎవరిని నియమిస్తారనేది తెలియాల్సి ఉంది.

డ్వాక్రా గ్రూపు సభ్యుల
రూ.కోటి నిధులు హాంఫట్

- బ్యాంకు మేనేజర్ సహా ఆర్పీ, మెప్మా సిబ్బందిపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో డ్వాక్రా సంఘాలకు చెందిన నిధుల స్వాహా పర్వం ఆగడం లేదు. తాజాగా మరో రూ.కోటి నిధులు గోల్‌మాల్ కావడంపై కేసు నమోదయ్యింది. బాధితుల్లో ఒకరైన మాధవి ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. దీపిక ఎస్ఎల్ఎఫ్ పేరుతో ఉన్న 26 సంఘాలకు నౌహీరా రీసోర్సు పర్సన్‌గా పనిచేస్తోంది. ఈ సంఘాలకు సంబంధించి 260 మంది సభ్యులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను రెండేళ్లుగా నౌహీరా ద్వారా చెల్లిస్తున్నారు. తిరుపతి బైరాగిపట్టెడలోని ఇండియన్ బ్యాంకు మాజీ మేనేజర్ ధనంజయ, మెప్మా సిబ్బంది అమ్మాజీ, ప్రమీల, రెడ్డెమ్మ, వసంత, పాతిమాతో నౌహీరా కుమ్మక్కై బ్యాంకులో నకిలీ డిపాజిట్ కౌంటర్ ఫైల్ తీసుకుని డబ్బులు బ్యాంకులో చెల్లించకుండానే చెల్లించినట్లు నకిలీ రసీదులు సృష్టించింది. వాటిని డ్వాక్రా గ్రూపు సభ్యులకు ఇస్తూ వచ్చింది. రుణాలు చెల్లించా లంటూ కొన్ని రోజులుగా బ్యాంకు సిబ్బంది నుంచి డ్వాక్రా సభ్యులకు ఒత్తిడి రావడంతో ఆమెను నిలదీశారు. నౌహీరా నీళ్ల నమలడంతో బ్యాంకుకు వెళ్లి విచారించారు. రెండేళ్ల నుంచి బ్యాంకులో పైసా కూడా చెల్లించలేదని తేలింది. బాధితురాలు మాధవి ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు బ్యాంకు మాజీ మేనేజర్‌తోపాటు నౌహీరా, మెప్మా సిబ్బందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిండుకుండల్లా జలాశయాలు


- 75శాతం చెరువులకు జలకళ
- 2 లక్షలకుపైగా ఎకరాలకు సాగునీరు
- సంతోషంలో రైతాంగం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో వారం రోజులపాటు వర్షాలు కురిశాయి. జలాశయాలకు భారీగా వరదనీరు చేరింది. స్వర్ణముఖి నది, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పిచ్చాటూరు వద్ద ఉన్న ఆరణియార్, కేవీబీపురం వద్ద ఉన్న కాళంగి, రేణిగుంట వద్ద ఉన్న మల్లిమడుగు, వాకాడు, శ్రీకాళహస్తి వద్ద స్వర్ణముఖి బ్యారేజీ జలకళ సంతరించుకున్నాయి. వీటి ద్వారా సుమారు లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుంది. జిల్లాలో 2,500కుపైగా చెరువులు ఉండగా 900 చెరువుల్లో 30 శాతం నీరు చేరింది. 300 చెరువులకు పైగా నిండి కలుజులు పారుతున్నాయి. వీటిద్వారా 40వేల ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందనుంది. వీటికితోడు నెల్లూరు జిల్లా రాపూరు వద్ద ఉన్న కండలేరు ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండింది. ఈ ప్రాజెక్టు నుంచి వచ్చే నీరు జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. తిరుమలకు తాగునీరు అందిస్తున్న కల్యాణి డ్యామ్‌లో 0.331 టీఎంసీల నీరు చేరింది. దీంతోపాటు తిరుమలలోని పలు ప్రాజెక్టులు నిండటంతో శ్రీవారి భక్తులకు తాగునీటి సమస్య లేకుండా పోయింది. జలాశయాలకు పుష్కలంగా నీరు చేరిందని, వరద ముప్పు రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకున్నామని జిల్లా జలవనరులశాఖ ఈఈ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. కాళంగి రిజర్వాయర్‌కు రూ.40లక్షలతో 18 గేట్లు మరమ్మతులు చేయించామన్నారు.



కాళంగి జలాశయం

జలాశయం	గరిష్ఠం (కెపాసిటీ)	ప్రస్తుతం నీటి నిల్వ (టీఎంసీ)
అరణియార్	1.853టీఎంసీ	1.853టీఎంసీ
కాళంగి రిజర్వాయర్	0.240 టీఎంసీ	0.240టీఎంసీ
మల్లిమడుగు	0.181 టీఎంసీ	0.181 టీఎంసీ
కల్యాణిడ్యాం	0.910టీఎంసీ	0.331 టీఎంసీ
స్వర్ణముఖి బ్యారేజీ(వాకాడు)	0.033టీఎంసీ	0.033టీఎంసీ
స్వర్ణముఖి(శ్రీకాళహస్తి)	0.031టీఎంసీ	0.031టీఎంసీ



ఆరణియార్ జలాశయం

చంద్రగిరి

పింఛన్ల పంపిణీ



పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే

తిరుమల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని స్థానికులకు శనివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పింఛన్లను పంపిణీ చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆయన బాలాజీనగర్‌ను సందర్శించారు. కొంతమందికి పింఛన్లను అందించారు. ఈక్రమంలో స్థానికులు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ఎమ్మెల్యే మరోసారి వివరించారు. అన్ని సమస్యలను సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తిరుమల జనసేన, టీడీపీ నేతలు జీవన్ రాయల్, కుమారస్వామి, సుధాకర్, త్రిలోక్, భాస్కర్, విగ్నేష్, వంశీ, అశోక్, శివషణ్ముగం, ఆనంద్, విశ్వనాథ్ ఉన్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి శుక్రవారం బంగారు తిరుచ్చి వాహనంపై దర్శనమిచ్చారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించాక ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా ఉత్సవర్లకు కల్యాణోత్సవం నిర్వహించారు. శ్రవణా నక్షత్రం సందర్భంగా సాయంత్రం ఊంజల్ సేవ జరిగింది. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి,బంగారు తిరుచ్చి వాహనంపై మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు, అర్చకులు పాల్గొన్నారు.

వ్యవసాయ సంఘాలతో రైతుకు ప్రయోజనాలు



సమావేశంలో మాట్లాడుతున్న శోభన్‌బాబు

రామచంద్రాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల్లోని మహిళా రైతుల అభివృద్ధికి ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేస్తోందని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు చెప్పారు. స్త్రీశక్తి భవన్‌లో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం జరిగిన మహిళా రైతుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సంఘాల వలన పంటలకు రైతులే గిట్టుబాటు ధర నిర్ణయించుకోవచ్చన్నారు. సులభంగా మార్కెటింగ్ చేసుకోవచ్చన్నారు. సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణపొంది తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే పంటలను సాగు చేసుకోవాలన్నారు. దళారీ వ్యవస్థను అరికట్టి లాభాలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గురుమూర్తి, ఎఫ్‌పీవో అధ్యక్షురాలు లక్ష్మి, మహిళా రైతులు, సీసీలు పార్వతమ్మ, సుధాకర్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల అందజేతపై ఆర్డీవో ఆరా



పింఛన్లు అందజేస్తున్న ఆర్డీవో రామ్మోహన్

రామచంద్రాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్టీకాలనీలో ఆర్డీవో రామ్మోహన్ శనివారం ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను అందజేశారు. ఈసందర్భంగా లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. పింఛను సరిగా వస్తుందా లేదా అని ఆరా తీశారు. తహసీల్దారు మధుసూదన్‌రావు, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు, మా.జీఎంపీపీ కేశవులునాయుడు, విజయకుమార్, నరసింహారెడ్డి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు ఒడ్డికాల్వలో పింఛన్లను పంపిణీ చేశారు.

రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు ప్రారంభం



విశేషాలంకరణలో స్వామి,అమ్మవార్లు

చంద్రగిరి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తొండవాడ స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈఉత్సవాలు ఈనెల 10 వరకు నిర్వహించనున్నారు. ఉదయం అభిషేనానతంరం విభూది అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవాలకు శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు. ఆలయ ఆవరణలో చలువ పందిళ్ళు విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. భక్తులు, పిల్లలు ఆటవిడుపు కోసం రంగురాట్నం, కొలంబస్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం అంకురార్పణ, కలశస్థాపన, మండపారాధన, గణపతి హోమం, ధ్వజారోహణం, పూర్ణాహుతి జరుగుతాయి. రాత్రి మూషిక వాహనంపై వినాయకస్వామి ఊరేగుతారు. ఉత్సవాలు ముగిసేవరకూ వాహన సేవలు నిర్వహిస్తారు. 10న త్రిశూల స్నానం, ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తామయని ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి తెలిపారు.

భక్తి శ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం

భాకరాపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లులోని భీమేశ్వర స్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అభిషేనంతరం సత్యనారాయణ స్వామి వ్రతంలో భాగంగా హోమం చేశారు. సత్యనారాయణస్వామి కథ వృత్తాంతాన్ని పురోహితులు చిన్నారి స్వామి చదివి వినిపించారు. మహిళలు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గ్రేటర్ తిరుపతిలో చేర్చాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న మనోహర్

చంద్రగిరి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ తిరుపతిలో రూరల్ మండలంలోని పుదిపట్ల, పెరుమాళ్ళపల్లె పంచాయతీలను విలీనం చేయాలని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ దేవర మనోహర్ శనివారం కలెక్టర్ వేంకటేశ్వర్‌ను కోరారు. ఈమేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిపాదించిన గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ప్రణాళికతో ఆధ్యాత్మిక నగరంగా విస్తరించడంలోసంతోషకరమన్నారు. చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల్లో పంచాయతీలను గ్రేటర్‌లో చేర్చడం శుభపరిణామన్నారు. పుదిపట్ల, పెరుమాళ్ళపల్లె పంచాయతీలు కూడా కలపాలన్నారు. జనసేన నాయకులు వాకా మురళి, నాగశేషు, మురళి, ప్రసాద్, బాల, పాల్గొన్నారు.

భక్తజన సంద్రం ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయం శనివారం భక్తజన సంద్రంగా మారింది. వారాంతపు సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 26వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

అమ్మవారి సేవలో తమిళనాడు మంత్రి

తిరుచానూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని తమిళనాడు రెవెన్యూ, విపత్తు నిర్వహణశాఖ మంత్రి రామచంద్రన్ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులుస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

కార్తీక పౌర్ణమికి సెలవు ఇవ్వాలి

తిరుపతిరూరల్, నవంబరు1(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పర్వదినం నాడు పాఠశాలలకు అధికారికంగా సెలవు ప్రకటించాలని హిందూ ఉపాధ్యాయసమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ డేగల కోరారు. సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్తీక పౌర్ణమికి పాఠశాల పనిదినాన్ని నిర్వహించేలా 50శాతంమంది టీచర్లు హాజరుకావాలని ఆదేశించడం సరికాదన్నారు. పాఠశాలకు సెలవు ప్రకటించాలని కోరుతూ పదివేలసంతకాలని సేకరించి రాష్ట్రప్రభుత్వానికి పంపామని పేర్కొన్నారు.

ఫారెస్టు సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవినాయక్



మంగళం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫారెస్ట్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అటవీశాఖ బయోట్రీమ్ పరిపాలన అధికారి రవి నాయక్ ఎన్నికయ్యారు. శనివారం తిరుపతిలోని కపిలతీర్థం వద్ద అటవీ కాంప్లెక్సులో అసోసియేషన్ తిరుపతి సర్కిల్ ఎన్నిక ఏపీఎస్జీవో అధ్యక్షులు సురేష్‌బాబు, లోకనాథ్, రత్నం, తిరుమల బాబుల ఆధ్వర్యంలో జరిగింది. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఆనంద్, అసోసియేట్ అధ్యక్షుడిగా టి.గణేష్, కోశాధికారిగా ఆర్.భాగ్యరాజ్, ఉపాధ్యక్షులుగా సునీత, సంయుక్త కార్యదర్శిగా శ్రీకాంత్, కార్యనిర్వాహక కార్యదర్శిగా రమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నాయిూ బ్రాహ్మణుల జనచైతన్యయాత్ర



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆవులపాటి బుజ్జి తదితరులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నాయిబ్రాహ్మణుల కులవృత్తి రక్షణ, పేటెంట్ హక్కుల సాధనకు ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జనచైతన్య సైకిల్‌యాత్రను ప్రారంభిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆవులపాటి బుజ్జి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ నవంబరు 5న ఉదయం 7గంటలకు జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నుంచి సైకిల్‌యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమంలో శిబ్బాల సుధాకర్, తులసి, భాస్కర్, సంజీవ రాయుడు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం



ప్రొఫెసర్ రాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ లా విభాగం శనివారం నిర్వహించిన ప్రత్యేక ఉపన్యాసం అందరినీ ఆకట్టుకుంది. ఆంధ్రా యూనివర్సిటీ లా ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి హక్కుల ప్రాముఖ్యతపై ప్రసంగించారు. హక్కులపై అవగాహన ఉన్నప్పుడే ఎవరైనా న్యాయం పొందడం, న్యాయ సహకారం అందించడం చేయగలరని అన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాజ్యలక్ష్మిని డీన్ అనురాధ, లా హెడ్ సీతాకుమారి, అధ్యాపకులు సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

తిరుపతి(కల్చరల్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి మాడవీధుల్లో శనివారం భజన మండలి ఆధ్వర్యంలో నగర సంకీర్తన భక్తిశ్రద్ధలతో జరిగింది. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఈ కార్యక్రమంతో భక్తిభావం సంతరించుకుంది. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. నగర సంకీర్తన మండలి సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, భాస్కరాచారి, చెంగారెడ్డి, గంగయ్య, మురళీ, సుబ్రహ్మణ్యం, పద్మావతి, సిద్దమ్మ, అరుణ, జయమ్మ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

తిరుపతి(కల్చరల్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తిరుపతి రుయా ఆసుపత్రి సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, సభ్యులు చంద్రబాబు యాదవ్, సుబ్రహ్మణ్యం యాదవ్, సురేష్ స్వామి, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రత



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సుబ్బరాయుడు

తిరుచానూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలకు పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. శనివారం సాయంత్రం తిరుచానూరులో అమ్మవారి ఆలయం, మాడవీధులు, పుష్కరిణి, వాహన పార్కింగ్ ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. పంచమితీర్థంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రతలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఏఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ ప్రసాద్, తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పెళ్లకూరు, నవంబరు, 1 (ఆంధ్ర జ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఓ యువ కుడు మృతి చెందిన ఘటన నందిమాల దళితవాడలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. దళితవాడకు చెందిన గంధం వీరా స్వామి(22) ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న ఏబీ స్విచ్ ఆఫ్ చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లి పోయాడు. స్థానికులు హుటాహుటిన నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి వీరాస్వామి మృతి చెందినట్టు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెళ్లి వివరాలు సేకరించారు.

అధ్వాన పారిశుధ్యంతో నిత్యం యాతనే



రోడ్డుపక్కనే కంకర, సిమెంట్ బ్రిక్స్ డంప్



గాంధీపురం రోడ్డుపె మురుగునీరు

తిరుపతి రూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గాంధీపురం గ్రామపంచాయతీ సచివాలయానికి కూతవేటు దూరంలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో డ్రైనేజీకాలువ నుంచి మురుగు పొంగి రోడ్డుపైకి చేరుతోంది. ఇది వాననీరుతో కలసి గుంతల్లో చేరుతోంది. దీంతో దుర్వాసన భరించలేకపోతున్నారు. గురుడానగర్ డ్రైనేజీనీరు గతంలో సప్లైచానల్ మీదుగా ముందుకు వెళ్లేది. వర్షాలు కురిసినపుడు మదర్‌డెయిరీమీదుగా పైనుంచి వచ్చే వాననీరు, డెయిరీ వ్యర్థాలు కలసి ఈ చానల్ ద్వారానే ముందుకు వెళ్తుండేది. డెయిరీ వ్యర్థాలు చెరువులోకి చేరి పశువులు మృత్యువాతపడుతున్నాయని కొందరు సప్లైచానల్‌ని మట్టితో పూడ్చేశారని తెలిసింది. దీంతో మురుగునీరు, వాననీరు ముందుకు కదలక రోడ్డుపక్కనే చేరుతోంది. ఇళ్లలోని వ్యర్థాలను డ్రైనేజీ కాలువకి సమీపంలో పడేస్తున్నారు. అవిలాల చెరువు ప్రహరీకి ఆనుకుని ఉన్న రోడ్డుపక్కనే ఇసుక, కంకర, వెయిట్‌లెస్ సిమెంట్ బ్రిక్స్‌ని డంప్ చేసి చిల్లర వ్యాపారం చేస్తుంటారు. నగరంలోకి రాకపోకలు సాగించే విద్యాసంస్థల వ్యాన్లు, ఇతర వాహనాల్లో వెళ్లే వారికి ఇబ్బందికరంగా మారుతోందని స్థానికులు పలువురు వాపోతున్నారు.

హోమ్‌స్టేలు పెట్టుకునే మహిళలకు రాయితీలు

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిపుష్టి సాధించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక కచ్చపి ఆడిటోరియంలో శనివారం ఆంధ్రప్రదేశ్ పర్యాటక సంస్థ, మెప్మా ఆధ్వర్యంలో హోమ్‌స్టే- బెడ్ అండ్ బ్రేక్ నిర్వహణపై ఔత్సాహిక మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మ, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మెప్మా పీడీ ఎప్రాయీమ్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో అనేక స్వయం ఉపాధి పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. అందులో భాగంగానే నగరంలో సొంత భవనాలు ఉన్న మహిళా సంఘాల సభ్యులు హోమ్‌స్టేలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం ఉచితంగా సోలార్ విద్యుత్, బ్యాంకు రుణాలు, ఇంటి పన్నుల మినహాయింపు కల్పిస్తుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ టూరిజం ఏ.డి.నాయుడు, ఆర్డీ డాక్టర్ రమణప్రసాద్, డీటీసీ జనార్దన్, వి.రమణ, ప్రమీల, జయరామ్, శంకర్, కృష్ణవేణి, సోమకుమార్ పాల్గొన్నారు.

హామీల అమలు కోసం పోరాటాలకు సిద్ధంకండి

- పి.హరినాథరెడ్డి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న పి.హరినాథరెడ్డి

తిరుపతి(ఆటోనగర్), నవంబరు1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేయడంలో పూర్తిగా విఫలమయ్యాయని, వాటి కోసం పార్టీ శ్రేణులు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు పి.హరినాథరెడ్డి పిలుపు నిచ్చారు. తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో శనివారం పార్టీ నగర సమితి నాయకుల సమావేశం అల్లాబక్ష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం పదేళ్ల క్రితం ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్‌లకు దోచిపెట్టడానికి కార్మిక చట్టాలను సవరిస్తూ, కార్మికులను బానిసలుగా మార్చుతోందని విమర్శించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ నాయకులు పోటీ చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, నగర కార్యదర్శి విశ్వనాథం, బి.చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ ఆహారంతో ఆరోగ్యకరమైన జీవితం సాధ్యం

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆర్గానిక్ ఆహారంతో ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమని నవయుగ ఆర్గానిక్ ఫ్రెష్ మార్టు నిర్వాహకులు వెంకటృష్ణారెడ్డి అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న రసాయనాల మేళవింపుతో ఉన్న ఆహార పదార్థాలు ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నాయన్నారు. ఆర్గానిక్ పద్ధతుల్లో పండించిన ధాన్యాలు, కూరగాయలు, పండ్ల వినియోగం ద్వారా శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కరోనా సమయంలో నవయుగ హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వేలాది మందికి ఉచితంగా ఆక్సిజన్ దానం చేసినట్లు తెలిపారు. స్టేట్ హార్టికల్చర్ మిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో తిరుపతి జిల్లాకు మాత్రమే వెజిటబుల్ క్లస్టర్ ప్రాజెక్టు కింద రూ.160కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రైతులు సేంద్రియ పద్ధతుల్లో పండించిన పంటలను నవయుగ ఆర్గనైజేషన్ కొనుగోలు చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో వెంకటరామరాజు, బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రిటైరైన పోలీసు అధికారులకు సత్కారం



పదవీ విరమణ పొందిన ఇద్దరు పోలీసు అధికారులను సన్మానిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో రిటైరైన ఇద్దరు అధికారులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. అక్టోబరులో రిటైరైన ఆర్ఎస్ఐ టీవీ రామకృష్ణ, తిరుమల ఏఎస్ఐ విజయబాబులను పోలీసు అతిథిగృహంలో శనివారం ఎస్పీ సుబ్బరాయుడు శాలువలతో సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో సుదీర్ఘసేవలకు సత్కారం ప్రధానమన్నారు. వారికి జ్ఞాపికలు అందచేశారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర కళాశాలల క్రీడా పోటీల ప్రారంభం



విజేతజట్టుకు ట్రోఫీ అందజేస్తున్న భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి

తిరుపతి(క్రీడలు), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ అంతర్ కళాశాల పురుషుల నాల్గో విడత క్రీడా పోటీలను శనివారం వీసీ టి.నర్సింగరావు ఘనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరకంగా, మానసికంగా సామాజికంగా ఎదుగుదలకు దోహదపడతాయన్నారు. ఎస్వీయూలోని వివిధ క్రీడా వేదికలలో హ్యాండ్‌బాల్, వాలీబాల్, ఖోఖో పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఖోఖో, హ్యాండ్‌బాల్ పోటీలలో ఎస్వీయూ కాలేజీ తిరుపతి జట్టు విజేతగా నిలిచింది. ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌రెడ్డి, ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి విజేత జట్టుకు ట్రోఫీ, ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఆరణియార్ గేట్లు మూసివేత



పిచ్చాటూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆరణియార్ రిజర్వాయర్ గేట్లను శనివారం పూర్తిగా మూసివేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం 29 అడుగులు ఉంది. పూర్తి స్థాయి నీటిమట్టం 32 అడుగులు కాగా 31 అడుగులు చేరే విధంగా చర్యలు చేపడతామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో 0, ఇన్‌ఫ్లో 200 క్యూసెక్కులు వస్తుందని వివరించారు.

ప్రతిభా పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పోలీసు స్మారక వారోత్సవాల్లో భాగంగా చేపట్టిన ప్రతిభా పోటీల్లో పద్మావతి కాలేజీ విద్యార్థులు బహుమతులు పొందారు. పద్మావతి మహిళా జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు డిల్సి, దీక్షిత వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి మూడు వేల చొప్పున నగదు బహుమతులు సాధించారు. వీరిని ఎస్పీ సుబ్బరాయుడు, ప్రిన్సిపాల్ భువనేశ్వరి అభినందించారు.

ఘంటసాల విగ్రహానికి పాలాభిషేకం

తిరుపతి(కల్చరల్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి వీవీమహల్ సమీపంలోని సర్కిల్ వద్దనున్న అమర గాయకుడు ఘంటసాల విగ్రహానికి శనివారం రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఘంటసాల అభిమాని మునేంద్రారెడ్డిని ఘనంగా సత్కరించారు. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గోపీనాథ్‌రెడ్డి, ఘంటసాల అభిమానులు వినాయకరెడ్డితదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ రెక్టార్‌గా అప్పారావు



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ రెక్టార్‌గా ఆ వర్సిటీ బయో కెమిస్ట్రీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు నియమితులయ్యారు. ఆయనకు వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు శనివారం నియామక ఉత్తర్వులు అందజేసి అభినందించారు. అప్పారావు సోమవారం బాధ్యతలు స్వీకరిస్తారు. షుగర్ వ్యాధి నివారణలో మొక్కల పాత్ర ప్రత్యేక అంశంపై పరిశోధనలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందారు. గత పదహైదు నెలలు ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ అప్పారావు సేవలందించారు. గతంలో సీడీసీ డీన్, డెవలప్‌మెంట్ డీన్, ఫార్మసీ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. నాలుగు పుస్తకాలు, 150 పరిశోధనా వ్యాసాలు రాశారు. 26 పీహెచ్‌డీలకు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. 12 పరిశోధనా ప్రాజెక్టులు పూర్తి చేశారు.

ముక్కంటి సేవలో ఇస్రో చైర్మన్



ఆలయం వద్ద ఇస్రో చైర్మన్ నారాయణన్

శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం ఇస్రో చైర్మన్ నారాయణన్ దర్శించుకున్నారు. ఆదివారం ప్రయోగించనున్న ఉపగ్రహం విజయవంతం కావాలని పూజలు చేయించారు. ఆలయం వద్ద ధర్మకర్తలమండలి చైర్మన్ కొట్టే సాయిప్రసాద్ స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు గుర్రప్పశెట్టి, ఆలయాధికారులు పాల్గొన్నారు.

గరుడ వారధిపై ఎస్పీ పరిశీలన



గరుడ వారధిపై ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేర విభాగం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తరచూ ప్రమాదాలతో ఆందోళన కలిగిస్తున్న గరుడ వారధిని ఎస్పీ సుబ్బరాయుడు శనివారం పరిశీలించారు. ప్రమాదాలకు ఆస్కారమిస్తున్న అంశాలపై అధ్యయనం చేశారు. లక్ష్మీపురం సర్కిల్, తిరుచానూరు ప్రాంతంలో జరుగుతున్న ప్రమాదాలపై ఆరా తీశారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ భక్తవత్సలం, రామకృష్ణమాచారి, సీఐలతో కలసి ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కలియతిరిగారు. ప్రమాదాల కట్టడికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మలుపుల వద్ద బ్లింకింగ్ లైట్లు, రేడియం ఏరో మార్కులాంటివి ఏర్పాటు చేయాలన్నారు.

అంకురా ఆస్పత్రిలో చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభం



చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(వైద్యం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పుట్టుకతోనే మానసిక, శారీరక సమస్యలతో జన్మించే ప్రత్యేక అవసరతలు కలిగిన చిన్నారులకు అధునాతన వైద్య పద్ధతులతో చక్కటి వైద్యం అందించి, వారిని సాధారణ చిన్నారులుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్‌ను అంకురా ఆస్పత్రిలో ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. అంకురా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్‌ను ఆయన మేయర్ డాక్టర్ శిరీష, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్‌లతో కలిసి శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇటువంటి కేంద్రాన్ని తిరుపతిలో ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్లో చిన్నారులకు అందించే సేవల గురించి ఐఏపీ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి వివరించారు. ఏఏవైయూ ఫౌండేషన్, ఆశ్రిత సీడీసీ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత చైల్డ్ డెవలప్మెంట్ స్క్రీనింగ్ క్యాంప్‌లో చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వంశీకృష్ణ, వైద్యనిపుణులు రవిచందర్, కవిత, పార్థసారథి, రమణ తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్ల లా కోర్సు ఏర్పాటు చేయాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో మూడేళ్ల లా కోర్సు ఏర్పాటు చేయాలని నేషనల్ లా స్టూడెంట్ యూనియన్ అధ్యక్షులు సుందరరాజు కోరారు. ఈ మేరకు వీసీ నరసింగరావును కలిసి శనివారం ఆయన వినతిపత్రం అందజేశారు.

శతాధిక వృద్ధురాలి కన్నుమూత



నరసమ్మ (ఫైల్‌ఫొటో)

తిరుపతి అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మంగళంలోని తిరుమలనగర్‌కు చెందిన కేతారి నరసమ్మ(103) అనే శతాధిక వృద్ధురాలు శనివారం తుదిశ్వాస విడిచారు. ఆమెకు పది మంది సంతానం. ఆమె వంశవృక్షంలో ప్రస్తుతం ఐదో తరం నడుస్తోంది. కుమారులు, కుమార్తెలు, మనుమలు, మునిమనుమలు కలిసి ఆమెకు ఇటీవల 103వ జన్మదిన వేడుకలను నిర్వహించారు. నరసమ్మ తన నివాసానికి సమీపంలో దాతల సాయం లేకుండా ఈశానేశ్వర శివాలయం నిర్మించింది. కొద్ది రోజుల క్రితం వరకూ ఆరోగ్యంగా గడిపింది. పది రోజులుగా మంచానికే పరిమితమైంది. శనివారం సాయంత్రం తుదిశ్వాస విడిచింది. ఆమె మృతికి పలువురు ప్రముఖులు, స్థానికులు సంతాపం తెలియజేశారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఘనంగా బిర్సాముండా జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న సరస్వతమ్మ

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): భగవాన్ బిర్సాముండా 150వ జయంతి వేడుకలు శనివారం బైరాగిపట్టెడలోని గిరిజనభవన్‌లో ఘనంగా జరిగాయి. ఆయన సేవలను పలువురు కొనియాడారు. జిల్లా గిరిజన సంక్షేమాధికారి రాజా సోము మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను తీసుకువచ్చిందన్నారు. అనంతరం మొక్కలను నాటారు. గిరిజన సలహామండలి సభ్యులు సుబ్బయ్య, గిరిజన భవన్ చైర్మన్ వెంకటరమణ నాయక్, హరి చౌహన్, సరస్వతమ్మ, విజయకుమార్, శ్రీనివాసులు, మురగనాయక్, శివనాయక్, కోటయ్య పాల్గొన్నారు.

ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన

తిరుపతి(వైద్యం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో ర్యాగింగ్‌కు పాల్పడకుండా చర్యలు చేపడుతున్నామని సంస్థ డైరెక్టర్ ఆర్వీ కుమార్ అన్నారు. స్విమ్స్‌లోని పద్మావతి ఓపీడీ భవనంలో ఆయన శనివారం యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి విద్యార్థుల వలన ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సీనియర్ విద్యార్థులు కొత్తవారికి ఆదర్శంగా నిలవాలన్నారు. ర్యాంగింగ్‌పై డీఎస్పీ శ్రీలత విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీన్ అలోక్‌సచన్, రిజిస్ట్రార్ అపర్ణ బిట్లా, ప్రిన్సిపాల్స్ ఉషాకళావత్, మాధవి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

'ఇండియాదే మహిళా క్రికెట్ ప్రపంచ కప్'



జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తున్న మహిళా క్రికెటర్లు, అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి(క్రీడలు), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మహిళా క్రికెట్ ప్రపంచ కప్ ఇండియాదేనని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరి విజయ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం జరగనున్న మహిళా ప్రపంచ కప్ ఫైనల్లో విజయం సాధించాలని కలియుగదైవం వేంకటేశ్వర స్వామిని ప్రార్థిస్తూ అలిపిరి పాదాల మండపం వద్ద ఆయన కొబ్బరికాయలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెమీస్‌లో ఆస్ట్రేలియాను మట్టికరిపించి ఫైనల్‌కు దూసుకెళ్లిన మహిళా క్రికెట్ జట్టు తుదిపోరులోనే అదే ఆటతీరును ప్రదర్శించి సౌత్‌ఆఫ్రికాపై ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ప్రపంచకప్ షెడ్యూల్స్‌లో భాగంగా విశాఖ మైదానంలో ఐదు మ్యాచ్‌లు ఆడటానికి ఏసీఏ చైర్మన్ కేశినేని శివనాథ్(చిన్ని), కార్యదర్శి సాన సతీష్‌బాబు ఎంతో కృషి చేశారన్నారు. స్పిన్ బౌలర్ శ్రీచరణి సెమీస్‌లో కీలక వికెట్లు పడగొట్టి తెలుగు సత్తా చాటిందన్నారు. అనంతరం జాతీయ జెండాను ప్రదర్శిస్తూ పాదాల మండపం నుంచి కొంత దూరం ర్యాలీ నిర్వహించారు. ఫైనల్లో భారత్ విజయం సాధిస్తుందని నినాదాలు చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసమూర్తి, కార్యదర్శి సతీష్‌కుమార్‌యాదవ్, హరిప్రసాద్, మహిళా క్రికెటర్లు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

96 శాతం పింఛన్ల పంపిణీ



తిరుపతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 96 శాతం జరిగింది. నగరంలోని 50 డివిజన్లలో నగరపాలక సిబ్బంది స్థానిక కూటమి నాయకులతో కలసి శనివారం ఉదయమే పింఛన్ల పంపిణీ చేపట్టారు. 36వ డివిజన్లో జరిగిన పంపిణీలో చిత్తూరు రవిశంకర్ యాదవ్, ఆవుల శంకర్ యాదవ్, శెట్టి యాదవ్, ఆముదాల వెంకటేష్, శ్రీనివాస యాదవ్, అబ్దుల్లా, ముని రాయల్, విజయ, ముస్లిం నాయకులు గౌస్ బాషా, యాసీన్ బాష పాల్గొన్నారు.

హథీరాంజీ మఠం పునర్నిర్మాణ నిర్ణయంపై హర్షం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): హథీరాంజీ మఠం భవనాన్ని పునర్నిర్మించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ నిర్ణయించడంపట్ల బీజేపీ సీనియర్ నాయకులు వరప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు ధన్యవాదాలు తెలిపారు. భవన నిర్మాణానికి కమిటీని నియమించి చర్యలు ప్రారంభించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సంస్కృత వర్సిటీలో కేంద్ర మంత్రి సతీమణి



మృదుల ఠాకూర్‌ను సత్కరిస్తున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ సతీమణి మృదుల ఠాకూర్ జాతీయ సంస్కృత వర్సిటీని శనివారం సందర్శించారు. యూనివర్సిటీలోని జగన్నాథ ఆలయాన్ని, ఒడిశా పీఠాన్ని సందర్శించారు. వీసీ కృష్ణమూర్తి ఆమెను సత్కరించారు. యూనివర్సిటీ చేపట్టిన బోధన, పరిశోధన, విస్తరణ కృషిని ఆమెకు వివరించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భూమన సంతాపం

తిరుపతి(జీవకోన), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ దుర్ఘటనలో పదిమంది భక్తులు చనిపోవడం కలచివేసిందని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో సంతాపం ప్రకటించారు. భక్తులకు మెరుగైన వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బంగారు కుటుంబాల పటిష్ఠతకు
కార్యాచరణ రూపొందించండి



మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)దత్తత తీసుకున్న కుటుంబాల పటిష్ఠతకు కార్యాచరణ రూపొందించాలని ఇంచార్జి జేసీ, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. పీ4 కార్యక్రమంపై శనివారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఆర్.ఆర్.రెడ్డి, శ్యాంబాబు ఇతర ప్రతినిధులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఐఎంఏ దత్తత తీసుకున్న 2వేల కుటుంబాల పటిష్ఠతకు తగు చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై కార్యాచరణ రూపొందించాలని ఐఎంఏ, నగరపాలక సంస్థ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఆరోగ్యపరమైన అన్ని సహాయక చర్యలకు తాము ముందుంటామని ఐఎంఏ ప్రతినిధులు తెలిపారు. ఈ సమావేశంలో డీసీ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, ఐఎంఏ సభ్యులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రీకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి ఎన్ఆర్ఐ థ్యాంక్స్



ఎస్పీ సుబ్బరాయుడిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎన్ఆర్ఐ తులసీ కుమార్

తిరుపతి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏజెంట్ల మాటలు నమ్మి ఉపాధికోసం విదేశాలకు వెళ్లేవారిని మోసపోతున్నవారిని అప్రమత్తం చేయడం, ఏజెంట్లకు హెచ్చరికలు జారీచేయడంపై ఎస్పీ సుబ్బరాయుడికి ఏపీఎన్ఆర్టీ మాజీ కోఆర్డినేటర్ డాక్టర్ ముక్కు తులసీకుమార్ ధన్యవాదాలు తెలిపారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో ఆయన మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. గల్ఫ్‌లో ఇబ్బందులు పడుతున్న తెలుగువారికి అండగా నిలుస్తున్న ఏపీఎన్ఆర్టీ ప్రతినిధులను ఎస్పీ అభినందించినట్టు తెలిసింది.

ఘనంగా స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్



అభ్యసన సామగ్రిని పరిశీలిస్తున్న ఏజీఎం శ్రీనివాసులు

తిరుపతి(విద్య), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక మంగళం భూపాల్ హౌసింగ్ కాలనీలోని నారాయణ పాఠశాలలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ శనివారం జరిగింది. నారాయణ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు, ఏజీఎం శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉపాధ్యాయులు తయారుచేసిన బోధన, అభ్యసన సామగ్రిని పరిశీలించారు. అనంతరం బోధన, అభ్యసన సామగ్రిద్వారా నేర్చుకున్న అంశాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు క్రీడా పోటీలు నిర్వహించారు. పాఠశాల పాఠశాల ప్రిన్సిపాల్ అంసవేణి, ఆర్ఐ వసంత్, సీవో గాయత్రి, వైస్ ప్రిన్సిపాల్ అనూష, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహాకవి కాళిదాసుకు ఘన నివాళి



కాళిదాసు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మహాకవి కాళిదాసు జయంతి సందర్భంగా సంస్కృత యూనివర్సిటీలోని కాళిదాసు విగ్రహానికి శనివారం వీసీ కృష్ణమూర్తి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. సాహిత్య రంగంలో కాళిదాసు చేసిన కృషిని కొనియాడారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శనివారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కేఎస్ ముడగల్, తెలంగాణ రాష్ట్ర మంత్రి వి.శ్రీహరి దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




మంత్రి శ్రీహరి - జస్టిస్ ముడగల్

త్యాగమే సేవకు మూలం

అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఎస్పీ సుబ్బరాయుడు

విద్యార్థులు, పోలీసు సిబ్బంది పిల్లలకు ప్రశంసాపత్రాల పంపిణీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): త్యాగమే సేవకు మూలమని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. పోలీసు అతిథిగృహం కాన్ఫరెన్సు హాలులో శనివారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. వివిధ రకాల పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు, పోలీసు సిబ్బందికి, వారి పిల్లలకు ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో యువత, పోలీసు సిబ్బంది దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగభూషణరావు,డీఎస్పీలు శ్రీలత, శ్యాం సుందర్, ఆర్‌ఐ హరికృష్ణ, పోలీసు అసోషియేషన్ నాయకులు సోమశేఖర్, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.76 కోట్లు


శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,539

తలనీలాలు సమర్పించినవారు: 23,144



రైతులకు వరం కారాకొల్లు కషాయం





- నేల సురక్షితం.. దిగుబడి అధికం.. కలుపు మాయం
- గ్రామీణశాస్త్రవేత్తల పరిశోధనా ఫలితం

SUNDAY SPECIAL

తొట్టంబేడు మండలం కారాకొల్లు గ్రామానికి చెందిన రైతు గల్లా చంద్రశేఖర్ నాయుడు, ఆయన మిత్ర బృందం నాలుగు దశాబ్దాలుగా పలు పరిశోధనలు చేస్తున్నారు. నేలతల్లిని కాపాడుకునే దిశగా వీరు చేస్తున్న పరిశోధనలు మంచి ఫలితాలను ఇచ్చాయి. మూలికా విధానం ద్వారా నెమటోడ్స్ (వేరు పురుగు)ను నివారించే మందును 2012లో కనిపెట్టారు. దీనికి నెమ్‌జాప్ అని పేరు పెట్టారు. 2020లో అహ్మదాబాద్ సృష్టి ల్యాబ్స్ నుంచి దీనికి పేటెంట్ కూడా పొందారు. ఇక కలుపు నివారణ కోసం వీడ్ జాబ్, పంట ఎదుగుదల కోసం గ్రోత్ ఫిట్ కషాయాలను రూపొందించారు. ఈ రెండింటితో పాటు మరికొన్ని ఉత్పత్తులు కలుపుకుని మొత్తం పదింటికి పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

- కథనం : శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

25 వేల ఎకరాలకు కారాకొల్లు మందులు

కారాకొల్లు గ్రామీణ శాస్త్రవేత్తల మిత్ర బృందం శ్రీకాళహస్తి పట్టణ శివార్లలో ప్రస్తుతం ఈ మందులను భారీ ఎత్తున తయారు చేస్తున్నారు. యూరియా పొటాషియంలకు ప్రత్యామ్నయం కావడంతో గ్రోత్ ఫిట్ మందు పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు. కలుపు నివారిణి వీడ్‌జాబ్ మంచి ఫలితాలను ఇస్తోంది. దీంతో తెలంగాణలో సుమారు 5వేల మంది రైతులు పదివేల ఎకరాల్లో ఈ రెండు ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. మన రాష్ట్రంలో 6 వేల మంది రైతులు 12 వేల ఎకరాల్లో కారాకొల్లు కషాయాలను వాడుతున్నారు. సరిహద్దుల్లోని తమిళనాడు, కర్ణాటక నుంచి వీరి మందుల కోసం అడుగుతుంటారు. ఏడాదికి 40 వేల లీటర్ల మందులను వీరు ఉత్పత్తి చేసి రైతులకు అందిస్తున్నారు.

శ్రీకాళహస్తిలోని కషాయాల తయారీ బాధ్యతలన్నీ కారాకొల్లు రైతులే చూస్తున్నారు. గ్రామ్‌బజార్ అనే యూట్యూబ్ చానెల్ వీరి మందుల గురించిన సమాచారం వీడియోల రూపంలో పెడుతూ ఉంటుంది. ఈ మందులు వాడుతున్న రైతుల అనుభవాలను, పంటల తీరును చూపిస్తుంటారు.

కారాకొల్లు కషాయాలు కావాలంటే:
www.gramabazaar.com
వరిలో కొనుగోలు చేస్తే ఆర్టీసీ పార్శిల్ ద్వారా పంపుతారు.
వివరాలకు:
9849541674

కారాకొల్లు మందులు





వీడ్‌జాప్: వరిలో కలుపు నివారణకు అద్భుత ఫలితాలనిస్తోంది. ఎకరాకు మూడు లీటర్ల మందు అవసరం. ఇది లీటరు రూ.600

వాడే విధానం: వరి నాట్లకు ముందు నీళ్లు పెట్టి దమ్ము చేసుకునే సమయంలో ఈ మందును ఇసుకలో కలిపి చల్లాలి. వరి నాటుకున్న తర్వాత అందులోని నీళ్లు 15 రోజుల పాటు బయటకు పోనివ్వకుండా చూసుకోవాలి.

ప్రయోజనం: వరిలో సాధారణంగా వచ్చే ఏ రకమైన కలుపూ ఎదగదు. పైగా మొలిచిన కలుపును ఇది చంపేసి ఎరువుగా మార్చేస్తుంది.

గ్రోత్‌ఫిట్: ఇది మంచి పోషకం. వరి సహా అన్ని పంటలకూ వాడవచ్చు. వరి అయితే ఎకరాకు మూడు లీటర్లు అవసరం. లీటరు రూ.600.

వాడే విధానం: వరి నాటిన 25రోజులకు రెండు లీటర్ల మందు ఇసుకలో కలిపి చల్లాలి. ఆ సమయంలో పొలంతో నీళ్లు ఉండాలి. వరి వెన్ను వచ్చే ముందు అంటే 35 రోజులకు ఒక లీటరు మందులో 100లీటర్ల నీళ్లు కలిపి స్ప్రే చేయాలి. వరి 5నెలల పంట అయితే ఇంకోసారి 2లీటర్ల మందు వేయాలి.

ప్రయోజనం: పొలం పచ్చగా నిగనిగలాడుతూ ఎదుగుతుంది. వెన్ను బలంగా వస్తుంది. గింజ రాలదు. దిగుబడి పెరుగుతుంది.

నెమ్‌జాప్: వేరుపురుగును నివారించే ఈ మందు వరి, మామిడి తప్ప అన్ని రకాల పంటలకీ వాడుకోవచ్చు. కూరగాయల తోటల్లో ఇది మంచి ఫలితాలను ఇస్తోంది. ఎకరాకు రెండు లీటర్ల మందు అవసరం. లీటరు ధర రూ.800. దీనికి పేటెంట్ కూడా లభించింది.

వాడే విధానం: పంట వేసే ముందు ఇసుకలో కలిపి చల్లుకోవాలి. పంట వేశాక అయితే ఒక లీటరు మందును వందలీటర్ల నీళ్లలో కలిపి డ్రిప్‌లో వదలాలి.

ఈ మందు వాడిన 15రోజుల తర్వాత గ్రోత్ ఫిట్ స్ప్రే చేస్తే పూతవిరగ్గాస్తుంది. కాయ సైజు పెరుగుతుంది. నాణ్యత ఉంటుంది.

నొప్పి నివారిణి శ్రీశైలం

కారాకొల్లు గ్రామీణ శాస్త్రవేత్తలు తయారు చేసిన శ్రీశైలం పెయిన్ రిలీవర్‌గా ఉపయోగపడుతుంది. ఇది కూడా పూర్తిగా ఆకు పసరు నుంచి తయారు చేసిందే. నొప్పి ఉన్న చోట పూసుకుంటే చాలు. అలాగే పడుకునే ముందు ఒంటికి పూసుకుంటే దోమలు దగ్గరకు కూడా రావు. గాయాలకు పూస్తే వేగంగా నయమవుతాయి. సొరియాసిస్ తప్ప అన్ని రకాల చర్మ వాధులకు ఇది మంచి ఫలితాలు ఇస్తోందని గ్రామీణ శాస్త్రవేత్త చంద్రశేఖర్ చెబుతున్నారు.

ఎరువులకన్నా ఖర్చు తక్కువ

యూరియా, పొటాషియం, డీఏపీ వంటి రసాయన ఎరువులను సాధారణంగా రైతులు వినియోగిస్తారు. కలుపు నివారణకు మందులు చల్లుతారు. వీటికి ఎకరా వరికి రూ.6వేలు ఖర్చవుతుంది. చీడపీడల పురుగు మందుల కోసం రూ.8,400 వ్యయం చేయాలి. అంటే ఎకరా వరికి రూ.14,500లు ఖర్చు అవుతుంది. అదే కారాకొల్లు కషాయాలు వాడితే కేవలం రూ.3600తో ఎకరా వరి సాగవుతుంది.



వయ్యారిభామపై యమపాశం

వయ్యారిభామ, కాంగ్రెస్ గడ్డి, పార్థీనియం వంటి పేర్లతో పిలిచే పిచ్చి మొక్క తీవ్ర అనారోగ్యాలకు కారకమని గుర్తించి దీన్ని అణుబాంబుతో పోలుస్తారు. కారాకొల్లు శాస్త్రవేత్తలు తయారుచేసిన కలుపుమందును చల్లగానే అర గంట వ్యవధిలో వయ్యారిభామ నిలువునా మాడిపోతుంది. ఇది తర్వాత అదే నేలకు ఎరువుగా మారిపోతుంది. ఈ మందు కూడా మన చుట్టూ లభించే పిచ్చిమొక్కల నుంచే తయారు చేయడం విశేషం. రైతులకు మరింత లాభదాయకంగా ఉండేలా ఈ మందుపై పరిశోధనలు కొనసాగిస్తున్నారు.

40 ఏళ్ల క్రితం నేను, బాస్కర్, బత్తినాయుడు, మురళి, వెంకటేశ్వర్లు, శివయ్య, చిరంజీవులు, శ్రీధర్ అనే ఏడుగురు మిత్రులు కలిసి ప్రారంభించిన పరిశోధనల ఫలితమే ఇవి. రసాయన ఎరువులు, పురుగుమందులు భూమి కడుపులో విషంగా మారి మన ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నాయని అందరికీ తెలుసు. ప్రత్యామ్నాయంగా సేంద్రియ సేద్యాన్ని సూచిస్తున్నారు. గడ్డి, ఆకులు వంటివి మేతగా స్వీకరించే పశువుల విసర్జితమే ఈ సేద్యంలో కీలకం. నేలలో మిత్రకీటకాల వృద్ధికి దోహదం చేస్తున్నది ఇదే. పశువులు స్వీకరించి విసర్జించిన తర్వాత ఏర్పడే సేంద్రియ గుణాలను కలిగివున్న మొక్కలపై దశలవారీగా మేం చేసిన పరిశోధనల్లోంచే గ్రోత్‌ఫిట్, నెమ్‌జాప్, వీడ్‌జాబ్ వంటివి తయారయ్యాయి. ఇంకా చవగ్గా రైతులకు అందించేలా ఇప్పటికీ మా పరిశోధనలు కొనసాగుతున్నాయి.

- చంద్రశేఖర్



పైరు బాగా పెరిగింది

మాది తొట్టంబేడు మండలం కొమ్మలగుంట గ్రామం. నాకున్న ఎకరా నేలలో తెలంగాణ నుంచి గౌతమ బుద్ధ అనే దేశవాళీ నాటు వరి విత్తనాలను కొనుగోలు చేశాను. ధాన్యం చూడ్డానికి నల్లగానూ.. అన్నం మామూలుగా తెల్లగాను ఉంటుంది. ఇది అరుదైన రకం కావడంతో కిలో బియ్యం రెండు వందల యాభై రూపాయలు చొప్పున మార్కెట్ ధర ఉంది. కారాకొల్లు కషాయాలు చల్లాను. వీడ్‌జాబ్‌తో అసలు కలుపు సమస్య రాకుండా... ఎరువుగా కూడా ఉపయోగపడి పైరు బాగా వచ్చింది. మధ్యలో గ్రోత్ ఫిట్ వినియోగించాను. పైరు బాగా ఎత్తుగా పెరిగింది.

- రాంబాబు





పోటీలను ప్రారంభిస్తున్న రవినాయుడు

రాష్ట్రస్థాయి లాన్‌టెన్నిస్ పోటీలు ప్రారంభం

శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విక్రమ్ టెన్నిస్ అకాడమీలో శనివారం 69వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ లాన్ టెన్నిస్ అండర్-14, అండర్ 17, అండర్-19 పోటీలను శాప్ చైర్మన్ రవినాయుడు ప్రారంభించారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి జిల్లాకు 30మంది చొప్పున 390మంది క్రీడాకరులు ఈ పోటీలకు విచ్చేశారు. ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులు వచ్చే నెలలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా స్కూల్ గేమ్స్ పోటీలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చెంచయ్యనాయుడు, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, మండలాధ్యక్షుడు కృష్ణయాదవ్,ఏర్పేడు మండలాధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు,నాయకులు కాసరం రమేష్,రవీంద్రనాథ్‌రెడ్డి, కూటమి నాయకులు,తిరుపతి స్కూల్‌గేమ్స్ కార్యదర్శి కిషోర్ పాల్గొన్నారు.

హథీరాంజీ మఠం కూల్చివేస్తారన్నది అపోహ మాత్రమే

- దెబ్బతిన్న ప్రాంతాన్నే పునర్నిర్మిస్తాం
- కలెక్టర్ వెంకటేశ్వర్



తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి గాంధీ రోడ్డులోని హథీరాంజీ మఠాన్ని మొత్తంగా కూల్చివేస్తారన్నది అపోహ మాత్రమేనని, దెబ్బతిన్న ప్రదేశాలను పునర్నిర్మిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఈ అంశంపై కలెక్టరేట్‌లో శనివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యతో కలిసి ప్రజాప్రతినిధులు, మఠం కమిటీ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. పురాతనమైన హథీరాంజీ మఠం విషయంలో ఎక్స్పర్ట్ కమిటీని నియమించి వారి సలహాలు తీసుకున్నామని తెలిపారు. గాంధీ రోడ్డు వైపు ఉన్న భాగం దెబ్బతిందని, ఉత్తరం వైపు ఉన్న మొదటి అంతస్తు భాగం పూర్తిగా ధ్వంసమైందని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రసన్నకుమార్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్ డైరెక్టర్ ఆర్ఎస్ఎస్ మూర్తి తెలిపారన్నారు. ఈ మఠాన్ని మద్రాస్ టెర్రస్ రూఫింగ్ టెక్నాలజీని ఉపయోగించి పూర్వం నిర్మించారని, అదే తరహాలో పునర్నిర్మాణం చేస్తామని అన్నారు. త్వరగా పూర్తి చేసి, బంజారా భక్తులకు వసతిగృహం, వ్యాపారులకు దుకాణాలను అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ సమావేశంలో తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో బాపిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ పాల్గొన్నారు.

కళలపైనా ఆసక్తి పెంచుకోండి

- బాలోత్సవ ప్రారంభోత్సవంలో కలెక్టర్ పిలుపు



తిరుపతి (కల్చరల్), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు విద్యార్థులు కళలూ సాహిత్యం పట్ల కూడా ఆసక్తిని పెంపొందించుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు.తిరుపతి నాల్గవ బాలోత్సవాన్ని నగరంలోని ఎస్వీఎస్ ఆర్ట్స్ కాలేజీలో శనివారం ఉదయం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల పిల్లల్లో సృజనాత్మక శక్తి మెరుగుపడుతుందన్నారు.ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని చేపట్టాలని,అవసరమైన సహాయ సహకారాలను జిల్లా యంత్రాంగం అందిస్తుందని హామీ ఇచ్చారు.డీఈవో కుమార్,సాంఘిక సంక్షేమ అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ...విద్యార్థులకు ఇది ఒక మంచి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.బాలోత్సవం స్థాపకులు మల్లారపు నాగార్జున మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగున్న సామర్థ్యాన్ని వెలికితీయాలనే సంకల్పంతో విద్య, శాస్త్రీయ, సాంస్కృతిక అంశాలపై పోటీలను నిర్వహిస్తున్నామన్నారు.పిల్లల్లో సామాజిక స్పృహ , దేశభక్తి, సమష్టి తత్వం పెంపొందించాలనే ఆశయంతో ఏటా ఈ కార్యక్రమాన్ని నాలుగేళ్లుగా ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.బాలోత్సవం గౌరవాధ్యక్షులు టెంకాయల దామోదరం, కస్తూరిబా గాంధీ ట్రస్టు చైర్మన్ పి.సి. రాయలు, రోటరీ క్లబ్ అధ్యక్షులు రాజేంద్ర శెట్టి, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ రమేష్ నాథ్ లింగుట్ల, క్రియా పిల్లల పండుగ సెక్రటరీ కాకినాడ జగన్నాథ రావు, ఎస్వీఎస్ కాలేజ్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ పాల్గొన్నారు.










చిన్నారుల సందడి

- హుషారుగా సాంస్కృతిక పోటీలు, ప్రదర్శనలు
- నేడు విజేతలకు బహుమతుల ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి):బాలోత్సవంలో విద్యార్థులు సాంస్కృతిక ప్రతిభా పోటీల్లో అదరహో అనిపించారు.వేలాది మంది చిన్నారులు తమలోని సుకుమార భావాలను వ్యక్తం చేసి ఆహూతులను మైమరిపించారు.ఆరు సమాంతర వేదికలపై ఇరవై ఒక్క అంశాలపై పోటీలు నిర్వహించారు.ఫ్యాన్సీ డ్రెస్, బొమ్మకు కథ రాయండి, కథ చెబుతాను ఊ కొడతారా, కథ రాయడం, స్పెల్-బీ (ఇంగ్లీషు), గజిబిజి సరిచేద్దాం, మ్యాప్, మెమరీ టెస్ట్, తెలుగు దినపత్రిక పఠనం, లేఖారచన, బెస్ట్ ఫ్రం వేస్ట్, జానపద నృత్యం, ఇన్‌స్ట్రుమెంట్, బుర్రకథ, ఏకపాత్రాభినయం, క్లాసికల్ డ్యాన్స్, దేశభక్తి గీతాలాపన, లఘునాటిక, చదరంగం వంటి అంశాలపై ఆసక్తికరంగా పోటీలు సాగాయి.ఆదివారం చిత్రలేఖనం, పదకేళి (పదవినోదం), గణిత తర్కం, తెలుగులో మాట్లాడటం, తెలుగులో ఉపన్యాసం, పద్యం-భావం, క్విజ్, మట్టితో బొమ్మల తయారీ, సంప్రదాయ నృత్యం, దేశభక్తి గేయాలాపన, జానపద నృత్యం, కోలాట ప్రదర్శనం, యోగ, శాస్త్రీయ సంగీతం, జానపద గీతాలు, చెస్ తదితర పోటీలు నిర్వహించనున్నారు.సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ముగింపు సభకు ఎస్పీ సుబ్బరాయుడు ముఖ్య అతిధిగా హాజరుకానున్నారు.సాంస్కృతిక ప్రతిభా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్టు బాలోత్సవం స్థాపకులు మల్లారపు నాగార్జున, అధ్యక్షులు నడ్డి నారాయణ తెలిపారు.

నేడు నారావారిపల్లెకు రోహిత్ దంపతుల రాక

చంద్రగిరి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తినాయుడు కుమారుడు, సినీహీరో నారా రోహిత్ దంపతులు ఆదివారం స్వగ్రామమైన నారావారిపల్లెకు రానున్నారు. ఇటీవల హైదరాబాదులో రోహిత్ వివాహమైన సంగతి తెలిసిందే. నవ దంపతులు ఉదయం నారావారిపల్లెకు చేరుకుని, రామ్మూర్తినాయుడు ఘాట్‌కు నివాళులు అర్పించనున్నారు. గ్రామదేవత దొడ్డి గంగమ్మకు, ఇంటి దేవత నాగాలమ్మకు పూజలు నిర్వహించనున్నారు. అనంతరం హైదరాబాదుకు వెళ్లనున్నారు.

పీఎం ఆదర్శ గ్రామాల అభివృద్ధికి నిధుల మంజూరు

- జెడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు

తిరుపతి రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎం ఆదర్శ గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.10కోట్లకు పైగా నిధులు మంజూరు చేసిందని, ప్రణాళిక సిద్ధం చేయాలని జెడ్పీసీఈవో వి.రవికుమార్ నాయుడు ఆదేశించారు. తిరుపతి రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఎంపీడీవోలు, పంచాయతీ, ఇరిగేషన్ విభాగాల ఇంజినీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ప్రభుత్వం మూడు దశలలో రూ.10కోట్లకు పైగా నిధులను మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లో రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు చేపట్టాలని సూచించారు. రెండు సంవత్సరాల కాల పరిమితితో ఈ నిధులను వినియోగించుకోవచ్చన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్‌నాయుడు

హత్య కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడితో సీఐ కిషోర్‌బాబు, ఎస్‌ఐ సురేష్‌బాబు

చిల్లకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మినపట్నం గ్రామ సమీపంలోని సాగరమాల రోడ్డు నిర్మాణం పనులు చేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన కూలీ నరసింగ్ ఓరమ్ హత్యకేసులో నిందితుడు సమీర్ నాయక్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం చిల్లకూరు పోలీస్ స్టేషన్ సీఐ కిషోర్‌బాబు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన నరసింగ్ ఓరమ్, సమీర్ నాయక్ మండలంలోని తమ్మినపట్నం గ్రామ సమీపంలోని సాగరమాల రోడ్డు నిర్మాణం పనులు చేసేవారు. వీరిద్దరూ ఈనెల 26వ తేదీ సాయంత్రం మద్యం తాగుతుండగా వివాదం ఏర్పడి ఘర్షకు దారి తీసింది. ఈ క్రమంలో నర్సింగ్ ఓరమ్‌పై సమీర్‌నాయక్ ఇనుపరాడ్డుతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన నర్సింగ్ ఓరమ్‌ను నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా, అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శనివారం సమీర్ నాయక్‌ను అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



పింఛన్లు అందజేస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రతినెలా 1వ తేదీ నాడే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేస్తున్న ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికే దక్కుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం రెండో పట్టణ పరిధిలోని మాళవ్యానగర్, జానికిరామ్‌పేట తదితర ప్రాంతాల్లో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, చంద్రమోహన్, జనార్దనరెడ్డి, రమణయ్య, నరసింహులు, ఇశ్రాయిల్ కుమార్, వేముల సునీల్, ప్రణీత్, ఓంప్రకాష్, పార్వతయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చెన్నూరు గ్రామంలో తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి, పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో హేమంత్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణయ్య, మనోహర్ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చెన్నూరులోని రామ లింగయ్య కాలనీలో టీడీపీ నాయకుడు ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, శివకుమార్, అభిలాష్‌రెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దారుకు ముఖ్యమంత్రి అభినందన



సీఎం చంద్రబాబునాయుడు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న తహసీల్దారు జయజయరావు

కోట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కోట తహసీల్దారు కటారి జయ జయరావును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందించారు. మొంథా తుఫాన్ సందర్భంగా తహసీల్దారు జయజయరావు ప్రజలకు విశేష సేవలు అందించారు. మండలంలోని సముద్ర తీరప్రాంత గ్రామాలు, మత్స్యకారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. స్వర్ణముఖి ముంపు ప్రాంతాలైన పుచ్చలపల్లి, దొరువుకట్ట, దైవాల దిబ్బ, అల్లంపాడు గ్రామాల్లోని ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ రెవెన్యూ తన సిబ్బందితో పాటు అన్నిశాఖలను సమన్వయం చేసుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఆయన సేవలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ గుర్తించి అవార్డు, ప్రశంసాపత్రానికి ఎంపిక చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. శనివారం ఉదయం ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోట తహసీల్దారు జయజయరావుకు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. సాయంత్రం కోట రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున రావు, ఆర్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది తహసీల్దారును గజమాలలతో సన్మానించి అభినందించారు.

జాతీయ విజ్ఞాన మేళాకు విద్యార్థి ఎంపిక




వర్ణికాశ్రుతి శర్మ

నాయుడుపేట/పెళ్లకూరు, నవంబరు, 1 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలోని చిల్లకూరుకు చెందిన సుధీర్ శర్మ, డోరతి వయోలా దంపతుల కుమార్తె వర్ణికాశ్రుతి శర్మ జాతీయ విజ్ఞాన మేళాకు ఎంపికైంది. నాయుడుపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో వర్ణికాశ్రుతి శర్మ 10వ తరగతి చదువుతోంది. ఆమె తల్లి డోరతి వయోలా పెళ్లకూరు మండలంలోని కానూరు రాజుపాలెం పాఠశాలలో ఉపాధ్యాయరాలుగా పనిచేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో వర్ణికాశ్రుతి శర్మ సత్తా చాటింది. అలాగే నాసా బృందంలోని ప్రముఖ ఇంజనీర్లతో జరిగిన ముఖాముఖిలో పాల్గొంది. చెన్నై యూనివర్శిటీలో నిర్వహించిన పెన్సిల్ ఆర్ట్‌లో వెంకటేశ్వరుడి రూపాన్ని గీయడంతో ఫైన్ ఆర్ట్స్ విభాగంలో గౌరవ డిప్లొమాకు ఎంపికైంది. న్యూ ఢిల్లీలో ఈనెల 6నుంచి 8వ తేదీ వరకు జరగనున్న జాతీయ విజ్ఞాన మేళాలో వర్ణికాశ్రుతి శర్మ పాల్గొననుంది. జాతీయ విజ్ఞాన మేళాకు ఎంపికైన వర్ణికాశ్రుతి శర్మను ఎంఈవో-2 మునిరత్నం, ప్రధానోపాధ్యాయులు మనోజ్ కుమార్, ఉపాధ్యాయలు అభినందించారు.

హాథీరాంజీ మఠం పునర్నిర్మాణ నిర్ణయంపై హర్షం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): హాథీరాంజీ మఠం భవనాన్ని పునర్నిర్మించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ నిర్ణయించడంపట్ల బీజేపీ సీనియర్ నాయకులు వరప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు ధన్యవాదాలు తెలిపారు. భవన నిర్మాణానికి కమిటీని నియమించి చర్యలు ప్రారంభించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నాయీ బ్రాహ్మణుల జనచైతన్యయాత్ర



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆవులపాటి బుజ్జి తదితరులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నాయిబ్రాహ్మణుల కుల వృత్తి రక్షణ, పేటెంట్ హక్కుల సాధనకు ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జనచైతన్య సైకిల్‌యాత్రను ప్రారంభిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆవులపాటి బుజ్జి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ నవంబరు 5న ఉదయం 7గంటలకు జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నుంచి సైకిల్‌యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమంలో శిబ్బాల సుధాకర్, తులసి, భాస్కర్, సంజీవరాయుడు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

తడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హుండీ చోరీ కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. మండల పరిధిలోని వెండ్లూరుపాడు వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి హుండీలు చోరీకి గురయ్యాయి. కేసు నమోదు చేసి విచారణ చేసిన పోలీసులు సూళ్లూరుపేట వత్రపాళెం ప్రాంతానికి చెందిన దిలీప్, ఆనంద్ అనే ఇద్దరు పాత నేరస్థుల హస్తం ఉన్నట్లుగా గుర్తించారు. ఆ మేరకు వారిపై నిఘా పెట్టారు. శనివారం ఇద్దరు నిందితులు తడలో ఉండగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఆలయ హుండీలో చోరీ చేసిన రూ.17వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరినీ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. కాగా, ఇద్దరు నిందితులపై గతంలో 8కేసులు ఉన్నాయని, జైలు శిక్ష కూడా అనుభవించారని ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు.

వీధికుక్కల దాడిలో బాలుడికి గాయాలు



గాయపడిన బాలుడు

బాలాయపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కయ్యూరు ఎస్టీ కాలనీలో శనివారం వీధి కుక్కలు దాడి చేయడంతో రెండేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన సుమన్, పుష్ప దంపతుల కుమారుడు నరసింహ ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో బాలుడికి తల, ముఖంపై గాయాలు అయ్యాయి.

ఆర్టీసీ బస్సు ఢీ - స్కూటరిస్టుకు గాయాలు

కోట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోట ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో శనివారం ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో హర్షాద్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వాకాడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కోట బస్టాండ్ నుంచి నెల్లూరుకు వెళ్తూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న హర్షాద్ తలకు తీవ్రగాయం అయింది. అతడిని కుటుంబ సభ్యులు కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పింఛన్ల పంపిణీ

వెంకటగిరి, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలపల్లి పంచాయతీ పరిధిలో లబ్ధిదారులకు పింఛన్లనను టీడీపీ మండల అధ్యక్షుడు పప్పు చంద్రమౌళిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాలూరు పాపయ్య, మురళి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

నాయుడుపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నాయుడుపేటలోని తుమ్మూరు, భరత్ నగర్‌లో శనివారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కటకం దీపిక, వైసీపీ జిల్లా కార్యదర్శి తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, పొట్లపూడి రాజేష్, రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

వెంకటగిరి, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి, లాలాపేట సింగిల్ విండోల ఛైర్మన్లు పప్పు చంద్రమౌళిరెడ్డి, గొల్లగుంట వెంకటముని శనివారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాథనాయుడు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, ఏఎంసీ వైస్ ఛైర్మన్ నూరి, మండల వ్యవసాయాధికారిణి సుజాత, ఏఎంసీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు అవ్వారు సత్యనారాయణ, నాయకులు మంకు ఆనంద్, శివనారాయణ, నక్కల వెంకటేశ్వర్లు, కోడూరు శినయ్య, జమ్మల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఏజీ కిషోర్ శ్రీధర్ తదితరులు

సూళ్లూరుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని దేగలపాలెంలో నివాసం ఉంటున్న పి.ఈశ్వరయ్య కూలి పనులు చేసుకుని జీవనం సాగించుకునేవాడు. ఈనెల 30న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఈశ్వరయ్య కోమాలోకి వెళ్లడంతో తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న రైతు సేవా సహకార సంఘం ఛైర్మన్ ఏజీ కిషోర్ శనివారం ఆస్పత్రికెళ్లి ఈశ్వరయ్య కుటుంబ సభ్యులకు రూ.20 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమణయ్య, శ్రీధర్, సతీష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్ల లా కోర్సు ఏర్పాటు చేయాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో మూడేళ్ల లా కోర్సు ఏర్పాటు చేయాలని నేషనల్ లా స్టూడెంట్ యూనియన్ అధ్యక్షులు సుందర్రాజు కోరారు. ఈ మేరకు వీసీ నరసింగరావును కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు.

గరుడ వారధిపై ఎస్పీ పరిశీలన

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తరచూ ప్రమాదాలతో ఆందోళన కలిగిస్తున్న గరుడ వారధిని ఎస్పీ సుబ్బరాయుడు శనివారం పరిశీలించారు. ప్రమాదాలకు ఆస్కారమిస్తున్న అంశాలపై అధ్యయనం చేశారు. లక్ష్మీపురం సర్కిల్, తిరుచానూరు ప్రాంతంలో జరుగుతున్న ప్రమాదాలపై ఆరా తీశారు. ఏఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ భక్తవత్సలం, రామకృష్ణమాచారి, సీఐలతో కలసి ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కలియతిరిగారు. ప్రమాదాల కట్టడికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మలుపుల వద్ద బ్లీకింగ్ లైట్లు, రేడియం ఏరో మార్కులాంటివి ఏర్పాటు చేయాలన్నారు.



గరుడ వారధిపై ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: విజయశ్రీ



రైతులకు యూరియాను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు

నాయుడుపేట టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని సొసైటీ కార్యాలయం వద్ద శనివారం ఎమ్మెల్యే విజయశ్రీ, సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం రైతులకు యూరియా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ... ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు బురదచల్లే ప్రయత్నాలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. అనంతరం లోతువానిగుంట వద్ద పింఛన్లు పంపిణీ చేశారు. ఆర్‌అండ్‌బీ రహదారి మరమ్మతు పనులను పరిశీలించారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, తహసీల్దారు రాజేంద్ర, ఎంపీడీవో సురేష్, వ్యవసాయశాఖ ఏవో గణేష్, నాయకులు అశోక్‌రెడ్డి, గంగాప్రసాద్, నంచి కృష్ణయ్య, ముత్యాలయ్య, చేవూరి చెంగయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



కోటలో నిరసన తెలుపుతున్న చింతా మోహన్ తదితరులు

కోట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. కోట బజారుసెంటర్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా మోహన్ మాట్లాడుతూ రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారని, కూటమి ప్రభుత్వం రుణమాఫీ చేసి ఆదుకోవాలన్నారు. అదే విధంగా లక్షలాది మంది నిరుద్యోగులకు జీవనోపాధి కల్పించే దుగరాజపట్నం ఓడరేవు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటయ్య, చిరంజీవి, ప్రసాద్, రమణయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: నిరుద్యోగ యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. శనివారం మండలంలోని అశోక్‌పిల్లర్ వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు.

గిరిజన విద్యార్థులకు ఆధార్ నమోదు



గిరిజన విద్యార్థులకు ధృవీకరణ పత్రాన్ని అందజేస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టనంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన గిరిజన విద్యార్థులకు ఆధార్ నమోదు చేయించేందుకు అట్రాసిటీ కమిటీ సభ్యుడు పెంచలయ్య, టీడీపీ నాయకుడు చంద్రమౌళి చర్యలు తీసుకున్నారు. శనివారం తహసీల్దారు కార్యాలయం వద్ద గిరిజన విద్యార్థులకు ఆధార్ ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీనగర్ గిరిజన కాలనీకి చెందిన శివకుమార్ 4వ తరగతి, రమ్య 2వ తరగతి చదువుతున్నారు. వీరికి తల్లిదండ్రులు లేకపోవడంతో అదే ప్రాంతానికి చెందిన వెంకటరమణ అనే మహిళ వద్ద ఉంటున్నారు. వీరికి ఆధార్ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడంలేదు. ఈ విషయాన్ని గుర్తించిన పెంచలయ్య, చంద్రమౌళి సమస్యను తహసీల్దారు ప్రసాద్ దృష్టి తీసుకువెళ్లి ఆధార్ కార్డులు నమోదు చేయించేందుకు వీలుగా వారికి ధృవీకరణ పత్రాలను మంజూరు చేయించి అందజేయడం జరిగిందన్నారు.

వృద్ధురాలికి అంత్యక్రియలు

గూడూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న సత్యవతి(85) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఈ విషయాన్ని ఆశ్రమ నిర్వాహకురాలు కల్యాణి మెగా బ్రదర్స్ సేవాసమితి సభ్యులకు తెలిపారు. సేవాసమితి సభ్యులు చంద్రశేఖర్, మోహన్, ఓంకార్, విజయ్ తదితరులు హిందూ సంప్రదాయ పద్ధతిలో వృద్ధురాకి అంత్యక్రియలు నిర్వహించారు.

ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీలత

తిరుపతి(వైద్యం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో ర్యాగింగ్‌కు పాల్పడకుండా చర్యలు చేపడుతున్నామని సంస్థ డైరెక్టర్ ఆర్వీ కుమార్ అన్నారు. స్విమ్స్‌లోని పద్మావతి ఓపీడీ భవనంలో ఆయన శనివారం యాంటీ ర్యాంగింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి విద్యార్థుల వలన ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సీనియర్ విద్యార్థులు కొత్తవారికి ఆదర్శంగా నిలవాలన్నారు. ర్యాంగింగ్‌పై డీఎస్పీ శ్రీలత విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీన్ అలోక్‌సచన్, రిజిస్ట్రార్ అపర్ణ బిట్లా, ప్రిన్సిపాల్స్ ఉషాకళావత్, మాధవి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ లా విభాగం శనివారం నిర్వహించిన ప్రత్యేక ఉపన్యాసం అందరినీ ఆకట్టుకుంది. ఆంధ్రా యూనివర్సిటీ లా ప్రొఫెసర్ రాజ్యలక్ష్మీ హక్కుల ప్రాముఖ్యతపై ప్రసంగించారు. హక్కులపై అవగాహన ఉన్నప్పుడే ఎవరైనా న్యాయం పొందడం, న్యాయ సహకారం అందించడం చేయగలరని అన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాజ్యలక్ష్మిని డీన్ అనురాధ, లా హెడ్ సీతాకుమారి, అధ్యాపకులు సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

తిరుపతి(కల్చరల్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి మాడవీధుల్లో శనివారం భజన మండలి ఆధ్వర్యంలో నగర సంకీర్తన భక్తిశ్రద్ధలతో జరిగింది. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఈ కార్యక్రమంతో భక్తిభావం సంతరించుకుంది. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. నగర సంకీర్తన మండలి సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, భాస్కరాచారి, చెంగారెడ్డి, గంగయ్య, మురళీ, సుబ్రహ్మణ్యం, పద్మావతి, సిద్దమ్మ, అరుణ, జయమ్మ, పార్వతి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



వీరాస్వామి (ఫైల్‌ఫొటో)

పెళ్లకూరు, నవంబరు, 1 (ఆంధ్ర జ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఓ యువ కుడు మృతి చెందిన ఘటన పెళ్లకూరు మండలంలోని నందిమాల దళితవాడలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. దళితవాడకు చెందిన గంధం వీరా స్వామి(22) ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న ఏబీ స్విచ్ ఆఫ్ చేసే క్రమంలో విద్యుదాఘా తానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లి పోయాడు. స్థానికులు వీరాస్వామిని హుటాహుటిన నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి వీరాస్వామి మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు. 14 ఏళ్ల క్రితం వీరాస్వామి తండ్రి గున్నయ్య కూడా విద్యుదాఘాతంతోనే మృతి చెందాడు. భర్త, ఒక్కగానొక్క కుమారుడు విద్యుదాఘాతంతో మృతి చెందడంతో వీరాస్వామి తల్లి ఇంద్రమ్మ తీవ్రంగా రోదించారు.

మత్స్యకారులను ఆదుకుంటాం: టీడీపీ



మత్స్యకారులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న ఏఎంసీ ఛైర్మన్ మర్రి ప్రమీల, టీడీపీ నాయకులు

కోట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వాకాడు వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ మర్రి ప్రమీల అన్నారు. శనివారం మండల పరిధిలోని గోవిందపల్లిపాళెంలో 270 కుటుంబాల మత్స్యకారులకు ప్రభుత్వం అందించిన సరుకులను పంపిణీ చేశారు. మొంథా తుఫాన్ సమయంలో శ్రీనివాసస్తత్రం, గోవిందపల్లిపాళెం గ్రామాల్లోని మత్స్యకారులు వారం రోజులపాటు సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా వేట విరామం ప్రకటించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబానికి కిలో చొప్పున బాంగాళా దుంపలు, యర్రగడ్డలు, 50 కిలోల బియ్యం, ఆయిల్, చక్కెర, కందిపప్పు కిలో చొప్పున సరఫరా చేసింది. ఈ సరుకులను ఏఎంసీ ఛైర్మన్ ప్రమీల చేతులమీదుగా ఆయా గ్రామాలకు చెందిన మత్స్యకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, ఎంపీటీసీ దారా సురేష్, నాయకులు మురళి, చెంగల్‌రావు, ఎఫ్‌బీవో రెడ్యా నాయక్, డీటీ మల్లికార్జునరావు, వీఆర్వో శ్రీనివాసులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ సూపర్ వైజర్లు రవి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కాళికామాత జాతర



కాళికామాత ఆలయంలో యాగం చేస్తున్న వేదపండితులు

తడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోడిలింగాలపాడులో ఉన్న కాళికామాత ఆలయంలో శనివారం జాతర వేడుకగా మొదలైంది. ఆలయంలో కాళీకామాతకు విశేష పూజలు, పుష్పయాగం నిర్వహించారు. గ్రామస్తులు పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. అర్ధరాత్రి నుంచి అమ్మణ్ణి గ్రామోత్సవం నిర్వహించేందుకు పుష్పపల్లకిని ఏర్పాటు చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పరంధామయ్య ఆచారి దంపతులు ఈ కార్యక్రమాలకు ఉభయదాతలుగా వ్యవహరించారు.

'ఇండియాదే మహిళా క్రికెట్ ప్రపంచ కప్'



జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తున్న మహిళా క్రికెటర్లు, అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి(క్రీడలు), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మహిళా క్రికెట్ ప్రపంచ కప్ ఇండియాదేనని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరి విజయ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం జరగనున్న మహిళా ప్రపంచ కప్ ఫైనల్లో విజయం సాధించాలని కలియుగదైవం వేంకటేశ్వర స్వామిని ప్రార్థిస్తూ అలిపిరి పాదాల మండపం వద్ద ఆయన కొబ్బరికాయలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెమీస్‌లో ఆస్ట్రేలియాను మట్టికరిపించి ఫైనల్‌కు దూసుకెళ్లిన మహిళా క్రికెట్ జట్టు తుదిపోరులోనే అదే ఆటతీరును ప్రదర్శించి సౌత్‌ఆఫ్రికాపై ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ప్రపంచకప్ షెడ్యూల్స్‌లో భాగంగా విశాఖ మైదానంలో ఐదు మ్యాచ్‌లు ఆడటానికి ఏసీఏ ఛైర్మన్ కేశినేని శివనాథ్(చిన్ని), కార్యదర్శి సాన సతీష్‌బాబు ఎంతో కృషి చేశారన్నారు. స్పిన్ బౌలర్ శ్రీచరణి సెమీస్‌లో కీలక వికెట్లు పడగొట్టి తెలుగు సత్తా చాటిందన్నారు. అనంతరం జాతీయ జెండాను ప్రదర్శిస్తూ పాదాల మండపం నుంచి కొంతదూరం ర్యాలీ నిర్వహించారు. ఫైనల్లో భారత్ విజయం సాధిస్తుందని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసమూర్తి, కార్యదర్శి సతీష్‌కుమార్ యాదవ్, హరిప్రసాద్, మహిళా క్రికెటర్లు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫారెస్టు సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవినాయక్



మంగళం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫారెస్ట్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అటవీశాఖ బయోట్రిమ్ పరిపాలన అధికారి రవినాయక్ ఎన్నికయ్యారు. శనివారం తిరుపతిలోని కపిలతీర్థం వద్ద అటవీకాంప్లెక్సులో అసోసియేషన్ తిరుపతి సర్కిల్ ఎన్నిక ఏపీఎస్వీవో అధ్యక్షులు సురేష్‌బాబు, లోకనాథ్, రత్నం, తిరుమల బాబుల ఆధ్వర్యంలో జరిగింది. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఆనంద్, అసోసియేట్ అధ్యక్షులుగా టి.గణేష్, కోశాధికారిగా ఆర్.బాగ్యరాజ్, ఉపాధ్యక్షులుగా సునీత, సంయుక్త కార్యదర్శిగా శ్రీకాంత్, కార్యనిర్వాహక కార్యదర్శిగా రమాదేవి ఎన్నికయ్యారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

టీడీపీ సీనియర్ నాయకుడికి నివాళులు


శ్రీరామ్ పెంచులయ్యకు నివాళులు అర్పిస్తున్న చెంచయ్యనాయుడు

శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు శ్రీరామ్ పెంచులయ్య శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్, రామయ్య, సుదర్శన్‌రెడ్డి, నరేష్, బలరామ్‌యాదవ్, రమేష్ నాయుడు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ


పింఛను పంపిణీ చేస్తున్న చెంచయ్యనాయుడు

శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని 19వ వార్డు పరిధిలో శనివారం టీడీపీ పట్టణాధ్యక్షులు విజయకుమార్ లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి అలయ పాలకమండలి సభ్యులు గాదిపాకుల గోపి తదితరులు పాల్గొన్నారు. ● శ్రీకాళహస్తి మండలం మన్నవరం పంచాయతీ నిమ్మరాళ్లపల్లిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెంచయ్యనాయుడు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు.

త్రోబాల్‌ను రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించాలి

శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): త్రోబాల్‌కు రాష్ట్రస్థాయిలో 3శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఎస్‌జీఎఫ్‌ఐని రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించాలని వ్యాయామ ఉపాధ్యాయులు కోరారు. శనివారం పట్టణంలోని విక్రమ అకాడమీలో రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి శాప్ చైర్మన్ రవినాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు చెంగల్రాయులు, రమణ, కిషోర్, భార్గవి, సురేష్, ప్రభాకర్, వినోద్, హేము, సరోజమ్మ పాల్గొన్నారు.

అమరజీవికి నివాళులు



శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములుకు శనివారం జనసేన నాయకులు నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగం వల్లే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో తేజ, మణి, ప్రదీప్‌కుమార్, నవీన్, మహేష్, దినేష్, భాను పాల్గొన్నారు.

ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్

రేణిగుంట నవం బరు 1 (ఆంధ్రజ్యోతి): ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. శనివారం గాజులమండ్యం పంచాయతీ పరిధిలోని పిల్లపాళ్యం ప్రైవేటు భూములను లీజుకు తీసుకొని అక్రమంగా ఇసుక వ్యాపారం చేస్తూ ఉండడాన్ని గుర్తించారు. ఈ క్రమంలో ట్రాక్టర్లను సీజ్ చేశారు.

తిరుచ్చిపై రామచంద్రమూర్తి దర్శనం

నారాయణవనం, నవంబరు 1 (ఆంధ్ర జ్యోతి): నారాయణ వనంలో కొలువైన కల్యాణ వెంకన్న ఆలయంలో కార్తీక తెప్పోత్సవాలలో భాగంగా శనివారం సీతాలక్ష్మణ సమేత రామచంద్రమూర్తి తిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. కాగా పుష్కరిణి వద్ద ఒకరు మృతిచెందడంతో సాయంత్రం జరగాల్సిన తెప్పోత్సవాన్ని రద్దు చేశారు. ఆలయాధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

శనీశ్వరుడికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు అభిషేకం చేశారు.

ఇంటిపై కూలిన చెట్టు

కేవీబీపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దిగువపుత్తూరు ఎస్టీ కాలనీ లోని షణ్ముగానికి చెందిన ఇంటిపై పెద్దవేపచెట్టు కొమ్మ విరిగి పడింది. దీంతో వారు బయటకు పరుగులు తీశారు. మిద్దె దెబ్బతిని కూలిపోయేలా ఉంది. అధికారులు స్పందించి తమకు ఇల్లు మంజూరు చేసి ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే ఆర్థికసాయం

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీర్పాకోటలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తూ విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందిన కిన్నెర సాంబచిన్నయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పరామర్శించారు. రూ. 10వేల నగదును శనివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడి భార్యకు ఉద్యోగం, ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీవీరోడ్డులో కొలువైన అంకాలమ్మ ఆలయం వద్ద మరాఠీపాళెంకు చెందిన శివకుమార్‌రెడ్డి, యశ్వంత్‌రావు, హరిహర కుమార్, మునిబాబు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్రాంతి కుమార్, వినీత్‌రెడ్డి, కృపానిధి, లోకేష్‌యాదవ్, అరుణ్, శివప్రసాద్, దినకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం



శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పురపాలక సంఘ కమిషనర్ భవానీ ప్రసాద్‌ను శనివారం ఎంజీఎం గ్రూప్ చైర్మన్ గుడ్లూరు మల్లికార్జునాయుడు, డైరెక్టర్ మయూర్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. భవానీ ప్రసాద్ చిన్నాన్న, ముక్కంటి ఆలయ అప్పటి ఈవో శివాజీతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

ఆరణియార్ గేట్ల మూసివేత



పిచ్చాటూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆరణియార్ రిజర్వాయర్ గేట్లను శనివారం పూర్తిగా మూసివేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం 29 అడుగులు ఉంది. పూర్తి స్థాయి నీటిమట్టం 32 అడుగులు కాగా 31 అడుగులు చేరే విధంగా చర్యలు చేపడతామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఔట్ ఫ్లో 0, ఇన్‌ఫ్లో 200 క్యూసెక్కులు వస్తుందని వివరించారు.

సత్యవేడు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు కేంద్రంగా రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆదిమూలం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. శుక్రవారం సాయంత్రం తిరుపతిలోని కలెక్టరేట్‌లో ఆయనకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యవేడులో శ్రీసిటీ సెజ్‌తో పాటు అపోలో, హీరో, సీసీఎల్ తదితర పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని ఏడు మండలాలు కలిపి రెవెన్యూ డివిజన్‌ను సత్యవేడులో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా డీఎస్పీ కార్యాలయం ఉండాలని వివరించారు. సత్యవేడులో ఆర్‌డీవో కార్యాలయం ఏర్పాటుపై గత ఎన్నికల సమయంలో కూడా సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కలెక్టర్ స్పందిస్తూ రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సిఫార్సు చేస్తూ ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తానని తెలిపారు.

రాజీవ్‌నగర్‌లో సమస్యలు పరిష్కరించండి



నిరసన తెలుపుతున్న చింతామోహన్ తదితరులు

శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని రాజీవ్‌నగర్‌లో సమస్యలను పరిష్కరించాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ కోరారు. శనివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన రాజీవ్‌నగర్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2007లో నిరుపేదలకు ఒక్కొక్కరికి రెండు సెంట్లు చొప్పున 7,500మందికి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం స్థలం కేటాయించినట్లు తెలిపారు. కొంత మంది ఇళ్లు కట్టుకున్నారని మరికొంతమంది కట్టుకోలేకపోయారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాయకులు కాజేసిన స్థలాలు వారికే ఇచ్చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 300 ఇళ్లు కూల్చివేశారని ఆ అధికారం ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో రోజుకు రూ.10లక్షలు అవినీతి జరుగుతోందని విమర్శించారు. టీటీడీలో జరిగే అవినీతిపై సిట్‌వేసిన ప్రభుత్వం శ్రీకాళహస్తిలో జరిగే అవినీతి కనపడలేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తెయ్యనాయుడు, నరేంద్రనాయుడు, జనార్ధన్‌రెడ్డి, కూలి రవికుమార్ సమీవుల్లా, పెద్ద కృష్ణయ్య, వినోద్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

దిగువపుత్తూరులో అభివృద్ధి పనులకు శ్రీకారం


దివ్యాంగ విద్యార్థికి పింఛను ఇస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువపుత్తూరు గ్రామంలో శనివారం సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పలుఅభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ముందుగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమాన్ని ప్రారంభించి దిగువపుత్తూరుకు చెందిన దివ్యాంగుడైన ఇంటర్ విద్యార్థి రాహుల్‌కు రూ.10వేలు పింఛను అందజేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇల్లు లేదని, స్థలం లేదని ఏ ఒక్కరూ వచ్చినా అధికారులు పరిశీలించి వెంటనే మంజూరుచేయాలన్నారు. కాగా శనివారం ఎమ్మెల్యే కార్యక్రమానికి రెవెన్యూ హౌసింగ్‌కు సంబంధించిన అధికారులెవరూ హాజరు కాలేదు. దీంతో వారిపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని అసహనం వ్యక్తం చేశారు. అనంతరం సీసీ రోడ్డును ప్రారంభించారు. పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. పీఆర్ డీఈ గోపాల్‌ను పిలిచి సాధ్యమైన త్వరగా పంచాయతీ భవన నిర్మాణం పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాలతి, వ్యవసాయాధికారి కృష్ణకుమార్, ఎస్‌ఐ నరేష్, కార్యదర్శి దిలీప్‌తో పాటు నాయకులు మాజీ ఎంపీపీ మణి, రాయపేడు సర్పంచ్ బాలాజీ, వగత్తూరు ఇన్‌ఛార్జి డాక్టర్ రమేష్, ప్రవీణ్, అయ్యప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బంధువులే హంతకులు

ఒంటరి మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు

నాగలాపురం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండల కేంద్రంలో ఇటీవల జరిగిన ఒంటరి మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో బంధువులే హంతకులని తేలింది. నిందితులైన భార్యభర్తలను పోలీసులు అరెస్టు చేశారు. రిమాండుకు తరలించారు. నాగలాపురం పోలీసులు శనివారం విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. నాగలాపురం బీసీ కాలనీలో నివసిస్తున్న ఒంటరి మహిళ మునిలక్ష్మి(55) పట్టణంలోని హోటల్‌లో పనిచేసుకుంటూ జీవనం కొనసాగించేది. ఆమె ఒంటిపై ఎప్పుడూ నగలు ఉండేవి. మునిలక్ష్మికి దగ్గర బంధువులైన తిరుపతి జిల్లా నారాయణవనం మండలం ఉత్తరపు కండ్రిగ గ్రామానికి చెందిన నీలి దుర్వాసులు, అతని భార్య మునీశ్వరికి వాటిపై కన్ను పడింది. ఈ క్రమంలో గత నెల 24వ తేదీన మునిలక్ష్మి ఇంటికి చుట్టపుచూపుగా వచ్చారు. ఆ రాత్రి వేకువజామున మునిలక్ష్మి నిద్రలో ఉండగా ఆమెను హత్య చేశారు. మునీశ్వరి ఆమె కాళ్లు కదలకుండా పట్టుకోగా దూర్వాసులు ఆమె గొంతు నులిమి చంపాడు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న ఒక బంగారు చైన్, కమ్మలు, ముక్కు పుడకతో పాటు బీరువాలోని 2 బంగారు చైన్‌లు, 2 జతల కమ్మలు, ఒక జత మాటీలు, 2 ఉంగరాలు దోచుకెళ్లారు. ఈ సమావేశంలో సీఐ మురళి, ఎస్‌ఐ సునీల్, ట్రైనీ ఎస్‌ఐ ప్రసాద్, ఏఎస్‌ఐ షణ్ముగం, స్పెషల్ బ్రాంచి పోలీసు నటరాజ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

గతంలోనూ ఇదే తరహా హత్య

నిందితులు ఇది వరకే తమిళనాడు రాష్ట్రం మాదరపాకంలో ఇదే తరహాలో 2000 సంవత్సరంలో ఇంటి యజమానురాలిని హత్య చేశారు. ఆకేసులో జీవిత ఖైదు అనుభవించారు. తిరిగివచ్చి ప్రస్తుతం మళ్లీ హత్య చేశారు.


నిందితులను చూపుతున్న పోలీసులు

నీలగిరి చెట్ల నరికివేత రూ.10వేల జరిమానా

సత్యవేడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) అటవీశాఖ పరిధిలోని నీలగిరి చెట్లను అక్రమంగా నరికి తరలిస్తున్న వారికి రూ.10 వేలు జరిమానా విధించారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి దేవరాజులు కథనం మేరకు.. మండలంలోని ఏఎంపురం అటవీప్రాంతంలో శనివారం కొందరు అక్రమంగా నీలగిరి చెట్లను నరుకుతున్నట్లు సమాచారం అందింది. వెంటనే దాడులు చేసి నరికిన కలపను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు.

ఆధార్ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలి

రేణిగుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలోని నివసిస్తున్న సంచార జాతి గిరిజనులు ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని ఎంపీడీవో రవిచంద్ర కోరారు. శనివారం రేణిగుంటలోని సచివాలయం-1లో 5 తేదీ వరకు గిరిజనులకు మాత్రమే ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క గిరిజనుడికీ దక్కాలని తెలియజేశారు. అలాగే చదువుకు దూరం అవుతున్న సంచార జాతుల పిల్లలు ప్రతి ఒక్కరినీ బడిలో చేర్చేలా కొత్త ఆధార్ నమోదు చేయాలని పేర్కొన్నారు.

రేపు రుద్రాభిషేకం

పిచ్చాటూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధిరాజు కండ్రిగ గ్రామంలో కొలువైన గౌరీసమేత సోమనాదేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం 7.30 గంటలకు రుద్రాభిషేకం జరగనుంది. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ప్రదోష పూజలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త జ్యోతి రాజ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఇష్టంతో చదవాలి

శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం దిగువసాంబయ్యపాళెం ఫౌండేషన్ స్కూల్‌లో శనివారం నోబ్యాగ్ డే నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ప్రధానోపాధ్యాయులు కయ్యూరు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఒత్తిడిలేని అభ్యసనంతో విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి చెందుతారన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పెండింగ్ బిల్లులను తక్షణమే కూలీలకు చెల్లించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని సుందరయ్యభవన్‌లో శనివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం అధ్యక్షులు బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో రమణయ్య, తిరుపాల్, బాలగురవయ్య, కృష్ణయ్య, శంకరయ్య, ముని శంకర్, రమణయ్య, మురగేష్, సుబ్బయ్య, దినమని, బాలసుబ్రహ్మణ్యం, రాజయ్య పాల్గొన్నారు.

ఎస్వీయూ రెక్టార్‌గా అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ రెక్టార్‌గా ఆ వర్సిటీ బయో కెమిస్ట్రీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు నియమితులయ్యారు. ఆయనకు వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు శనివారం నియామక ఉత్తర్వులు అందజేసి అభినందించారు. అప్పారావు సోమవారం బాధ్యతలు స్వీకరిస్తారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా గ్రామోత్సవం



వడమాలపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వర స్వామివారిని స్వర్ణాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాలు, భక్తుల గోవింద నామ స్మరణల నడుమ శ్రీవారి ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ ఆండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామివారిని మేళతాలాలు, మంగళవాయిద్యాలు నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. అనంతరం ఆలయానికి చేరుకొన్న స్వామివారికి మంగళహారతులిచ్చారు. ఆలయ అధికారి వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ పాల్గొన్నారు.

టెండర్లను తిరస్కరించడం సిగ్గుచేటు

● మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆనంద్

పుత్తూరు అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు అభివృద్ధికి నిర్వహించిన టెండర్లను ఆమోదించకుండా తిరస్కరించడం సిగ్గుచేటు అని వైసీపీ కౌన్సిల్ పనితీరును మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ ఆనంద్ ఆక్షేపించారు. గడిచిన ఐదేళ్ల కాలంలలో చేపట్టలేని అభివృద్ధిని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆధ్వర్యంలో జరుగుతుండటాన్ని ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. ప్రజలకు అత్యవసరమైన డ్రైనేజీలు, తాగునీరు సౌకర్యాలు, బోర్లు, పైప్‌లైన్ వర్కులు, విద్యుత్ దీపాల ఏర్పాటు వంటి పనులను ఆమోదించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మాజీ మంత్రి రోజా ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ హరి, వైసీపీ కౌన్సిల్ పాలకవర్గం ఆమోదించలేదని దుయ్య బట్టారు. వెసీపీ కౌన్సిల్ వ్యవహార శైలి ఇలానే కొనసాగితే పుత్తూరు ప్రజలు క్షమించరని హెచ్చరించారు.

త్యాగానికి చిహ్నం ఆంధ్రరాష్ట్ర అవతరణ

పుత్తూరు అర్బన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల ఐక్యతకు, త్యాగానికి, ఆత్మగౌరవానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ చిహ్నంగా మిగిలిందని డాక్టర్ చంద్రమౌళి పేర్కొన్నారు. శనివారం డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మన్యం నరసింహులు, బాబురావు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

పుత్తూరు అర్బన్, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న పుత్తూరులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి. రాఘవేంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదల జీవితాల్లో వెలుగులే నిజమైన సంక్షేమం



పుత్తూరు అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన సంక్షేమం అని రాష్ట్ర వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు షణ్ముగరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక 1, 16, 26 వార్డుల్లో లబ్ధిదారులకు పెన్షన్‌లను పంపిణీ చేశారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆనంద్, లక్ష్మణాచారి, ఏలుమలైరెడ్డి, భాస్కర్, లక్ష్మీపతి, నవీన్ పాల్గొన్నారు.

గంజి మాధవయ్యకు ఘనస్వాగతం

పుత్తూరు అర్బన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య అమెరికా పర్యటన ముగించుకుని విచ్చేసిన సందర్భంగా పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. శనివారం గంజి మాధవయ్యను పుత్తూరు మండల అధ్యక్షుడు అరవ బాలాజీ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షుడు విష్ణు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

పంట యాజమాన్యంపై అవగాహన

వరదయ్యపాళెం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మొంథా తుపానుతో దెబ్బతిన్న పంటలను తిరుపతికి చెందిన రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసులు, దివ్య, కేవీకేశాస్త్రవేత్త శ్రీనివాసులు, వ్యవసాయాధికారి గౌరి తదితరులు పరిశీలించారు. మండలంలోని సీఎల్ఎన్‌పల్లి, కళత్తూరు గ్రామాలలో దెబ్బతిన్న పంటలను వారు సందర్శించారు. వరిలో నష్టం తగ్గించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు.

ముక్కంటి సేవలో ఇస్రో చైర్మన్



శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం ఇస్రో చైర్మన్ నారాయణన్ దర్శించుకున్నారు. ఆదివారం ప్రయోగించనున్న ఉపగ్రహం విజయవంతం కావాలని పూజలు చేయించారు. ఆలయం వద్ద ధర్మకర్తలమండలి చైర్మన్ కొట్టే సాయిప్రసాద్ స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు గుర్రప్పశెట్టి, ఆలయాధికారులు పాల్గొన్నారు.

భక్తజన సంద్రం ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయం శనివారం భక్తజన సంద్రంగా మారింది. వారాంతపు సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 26వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.